# తెలుగురాష్ట్రం దినపత్రిక

APTEL/2016/66202








అమలాపురం | సంపుటి : 10 సంచిక : 12 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | మంగళవారం 04 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 12 04-03-2025 Monday Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-


# తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్

- ఏర్పాటు చేసిన హీరో ఫ్యూచర్ ఎనర్జీస్
- రూ.1000 కోట్ల పెట్టుబడి, 2 వేల మందికి ఉపాధి
- ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం
- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుపతిలోని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం నాడు ఉండవల్లి నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్.. పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సాంకేతికత కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ శక్తి పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని వివరించారు. తిరుపతిలో ప్రవేశపెట్టబడిన స్కేలబుల్ మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇంకా దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అనుకరించవచ్చని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనలో పేర్కొన్నట్టుగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలిఅడుగు అవుతుందన్నారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద 160 గెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, క్లీన్ ఎనర్జీలో రూ.10 ట్రిలియన్ పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం ఉందన్నారు. శిలాజ ఇంధనాలపై ఆంధ్రప్రదేశ్ ఆధారపడటం తగ్గించడానికి, 2070 నాటికి భారతదేశం యొక్క నెట్-జీరో లక్ష్యానికి మద్దతు ఇవ్వడానికి, ముడి చమురు దిగుమతులను తగ్గించడానికి, ఇంధన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా

- తరువాయి 2లో..

# ఉత్కంఠంగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్




**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో ఫిబ్రవరి 27వ తేదీన 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు సోమవారం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. బ్యాలెట్ బాక్సులు కావడంతో ఫలితాలు రావడానికి ఆలస్యమయ్యే అవకాశం ఉంది. సోమవారం గుంటూరు - కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రారంభమైంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కూడా చెల్లుబాటు కానీ ఓట్లు ఉన్నాయి. ఉద్యోగస్తులు కూడా సరిగా ఓట్లు వేయకపోవడంపై ఎన్నికల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు-కృష్ణా ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ముందంజలో ఉన్నారు. తొలిరౌండ్‌లో 28 వేల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 17,246 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్.లక్ష్మణ్‌రావుకు 7,156 ఓట్లు వచ్చాయి. తొలిరౌండ్‌లో 10,090 ఓట్ల లీడ్‌లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధిక్యత సాధించారు. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైంది. మొత్తం 2,18,902 ఓట్లు పోలయ్యాయి. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బందితో ఓట్లు

- తరువాయి 2లో..

# పెరుగుతున్న చికెన్ ధరలు

**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**ఏపీలో బర్డ్ ఫ్లూ ప్రభావం కారణంగా గత కొన్ని రోజులుగా చికెన్ ధరలు భారీగా తగ్గాయి.ప్రజలు భయంతో చికెన్ కొనుగోళ్లకు దూరంగా ఉండటంతో మార్కెట్‌లో తీవ్ర నష్టం నెలకొంది. విజయవాడ, విశాఖ, తిరుపతి వంటి ప్రధాన పట్టణాల్లో చికెన్ మార్కెట్లను బర్డ్ ఫ్లూ భయం వెంటాడింది. కొన్ని చోట్ల కోళ్లను నాశనం చేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది.**

**బర్డ్ ఫ్లూ ప్రభావం**

తెలంగాణలో బర్డ్ ఫ్లూ ప్రభావం తక్కువగానే ఉన్నా, హైదరాబాద్‌లోని ప్రజలు కూడా కొంతకాలం చికెన్ తినేందుకు వెనుకంజ వేశారు. అయితే, ఇప్పుడు పరిస్థితి మారుతోంది. గత కొన్ని రోజులుగా కొత్త బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాకపోవడంతో, ప్రజలు మళ్లీ చికెన్ తినడం ప్రారంభించారు. ఆదివారం కావడంతో మార్కెట్లలో రద్దీ పెరిగింది.గత 15 రోజులుగా తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న చికెన్ వ్యాపారులు మళ్లీ కోలుకుంటున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి తర్వాత చికెన్ సేల్స్ పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గిందని, రాబోయే రోజుల్లో విక్రయాలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

**చికెన్ ధరలు భారీగా పెరిగే అవకాశం**

ప్రస్తుతం మార్కెట్లో చికెన్ ధరలు త్వరలోనే భారీగా పెరిగే అవకాశముంది. హెూటల్ రంగం, బకెట్ చికెన్ వ్యాపారులు మళ్లీ రికవరీలోకి వస్తారని ఆశిస్తున్నారు.

**ఏపీలో చికెన్ ధరలు**

విజయవాడలో కేజీ చికెన్ ధర 200 రూపాయలకు చేరింది. అంతక ముందు కేజీ చికెన్ ధర రూ.100 నుంచి రూ.150 పలకగా ప్రస్తుతం రూ.50 పెరిగి రూ.200లకు చేరింది. కాకినాడలో రూ.150 నుంచి రూ.170 మధ్య చికెన్ ధర పలుకుతోంది. ఈ ధరలు ఏపీలో రూ.250 వరకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నట్లు వ్యాపారస్తులు తెలుపుతున్నారు.

**హైదరాబాద్ లో చికెన్ ధరలు**

హైదరాబాద్ లో నేటి చికెన్ ధరల్లో కూడా చాలా మార్పులు వచ్చాయి. కేజీ స్కిన్ లెస్ చికెన్ ధం

- తరువాయి 2లో..



## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా

# గాదె శ్రీనివాసులునాయుడు

**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్టీయు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గాదె శ్రీనివాసులు గెలుపొందారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ మెజారిటీ రాలేదు. దీనితో రౌండ్ల వారీగా ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తి చేసి రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కించి విజేతను ప్రకటించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం 20,783 ఓట్లలో వెయ్యికి పైగా చెల్లని ఓట్లుగా నమోదయ్యాయి. మొత్తం 19,813 ఓట్ల లెక్కింపులో మ్యాజిక్ ఫిగర్ 10,068 ఓట్లుగా నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థి మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గాదె శ్రీనివాసులు నాయుడు మ్యాజిక్



- తరువాయి 2లో..

# మెగా డీఎస్సీల ద్వారా త్వరలో 16,347 పోస్టుల భర్తీ చేస్తాం.. మంత్రి లోకేష్



**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మెగా డీఎస్సీల ద్వారా త్వరలో 16,347 పోస్టుల భర్తీ చేస్తామని మంత్రి లోకేష్ నేడు జరిగిన అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు. సోమవారం ఎపి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. అనంతరం 2025-26 బడ్జెట్ పై చర్చ జరుగుతుంది. వివిధ కేటాయింపులు, సంక్షేమానికి నిధులు తదితర అంశాలపై సభలో చర్చ జరగనుంది. ప్రశ్నోత్తరాల నేపథ్యంలో స్కూళ్లలో ప్రహరీ నిర్మాణం, డీఎస్సీపై అసెంబ్లీలో మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. మెగా డీఎస్సీల ద్వారా త్వరలో 16,347 పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో ప్రహరీల నిర్మాణానికి రూ.3 వేల కోట్లు అవసరం అవుతుందని తెలిపారు. అన్ని కాలేజీలు, స్కూళ్లలో 'ఈగల్' బలందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ల ప్రహరీ గోడను పూర్తిచేయాలంటే రూ. 3 వేల కోట్లు అవుతుందని చెప్పారు. మనబడి-మన భవిష్యత్తు, ఉపాధి హామీ కింద దశల వారీ చేపడుతామన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్‌ను ఈ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని కాలేజీలకు,

- తరువాయి 2లో..

## ఏపీ లో మండలి

# నోటిఫికేషన్ జారీ



**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో మరో ఐదు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి ఎన్నికల రంగం సిద్ధమైంది. ఇప్పటికే రెండు గ్రాడ్యుయేట్, ఒక టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు త్వరలో వెల్లడవుతుండగా, ఇప్పుడు ఇంకో ఐదు ఎమ్మెల్సీ సీట్ల కోసం ఎన్నికలు జరగనున్నాయి. రిటైర్ అవుతున్న ఎమ్మెల్సీలు ఈ నెల 29న ఏపీ శాసనమండలిలో ఐదుగురు సభ్యుల పదవీకాలం ముగియనుంది.వీరి రిటైర్మెంట్, ఎమ్మెల్సీ సీట్ల ఖాళీపై ఇవాళ మండలి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.వీరి రిటైర్మెంట్, ఎమ్మెల్సీ సీట్ల ఖాళీపై ఇవాళ మండలి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**గెజిట్ నోటిఫికేషన్ విడుదల**

ఈ ఎమ్మెల్సీ సభ్యుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో, మండలి వారి రిటైర్మెంట్‌ను నోటిఫై చేస్తూ

- తరువాయి 2లో..

# మార్చి 7న ఏపీ క్యాబినెట్ భేటీ



**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మార్చి 7న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం కానుంది. ఈ సమావేశం సచివాలయంలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని వివిధ శాఖలకు సంబంధించిన కీలక అంశాలు, ప్రాజెక్టుల అమలు, ప్రజలకు సంబంధించిన సంక్షేమ పథకాలు క్యాబినెట్ సమావేశంలో చర్చకు రానున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక వ్యయాన్ని సమీక్షించి కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**రాష్ట్ర సీఎస్ (చీఫ్ సెక్రటరీ) విజయానంద్ ఆదేశాలు**

ఈ సమావేశానికి ముందుగా అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తమ ప్రతిపాదనలను మార్చి 5లోగా పంపించాలని రాష్ట్ర సీఎస్ (చీఫ్ సెక్రటరీ) విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో, ప్రభుత్వ నిధుల వినియోగం, పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# భాషాధిపత్యం

అనేది ఆయా సమూహాల సాంస్కృతిక అభివ్యక్తి. ప్రజల సంస్కృతి, సంస్కారం వ్యక్తమయ్యేది వారి మాతృభాషలోనే. జనుల హృదయావిష్కరణ జరిగేది వారి భాషలోనే. వారి బాధ, దు:ఖం, వేదన, సంతోషం, ఆనందం, ప్రేమ, అన్నింటికీ మాతృభాషే వాహకం. అందుకే మాతృభాషల ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు. మనదేశం, వేలాది భిన్నభాషల, సంస్కృతుల సమ్మేళనం. భిన్నత్వంలో ఏకత్వం లాంటి ఈ జాతి జీవనాడిపై ప్రతిసారీ దాడి జరుగుతూనే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్‌వాళ్లు మనల్ని ఆక్రమించాక మన సంస్కృతిలోకి భాష ద్వారా కూడా చొరపడే ప్రయత్నం చేశారు. మన విద్యావిధానానికి రూపకల్పన చేసిన మెకాలె, రక్తంలో భారతీ యులుగా, ఆలోచనలో ఆంగ్లేయులుగా ఉండేట్టు విద్యను తీర్చిదిద్దారు. వారి ఆలోచనలకు అనుకూలంగా సేవ కులుగా కొనసాగాము.ఆ తర్వాత ప్రపంచీకరణ పేరుతో వచ్చిన మార్కెట్ విస్తరణ, మన సాంస్కృతిక మూలాలపైనే కేంద్రీకరించాయి. ఆంగ్లభాషే జీవన భాషగా, జీవనోపాధిగా నిర్మించబడింది. ఏకరూప సంస్కృతిని తీసుకువచ్చే ప్రయత్నం జరిగింది. ఇప్పుడు మితవాద మతతత్వ శక్తులు సాంస్కృతిక వైవిధ్యతపై తీవ్రంగా దాడి ఎక్కుపెట్టారు. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే దేవుడు, ఒకే మతం, ఒకే నాయకుడు ఇలా ఒకే సంస్కృతిగా మార్చాలన్న ప్రయత్నంలో భాగంగానే నూతన విద్యావిధానాన్ని (2020) తీసుకువచ్చారు. గత కొన్ని సంవత్సరాల నుండి భాషాపరమైన ఆధిపత్యం కోసం పనిచేస్తున్నారు. అందులో భాగంగా హిందీ భాషను, ఇతర ప్రాంతీయ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దే చర్యలకు త్రిభాషా సూత్రం ఆధారంగా పాల్పడుతున్నారు.

దీన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడో భాషగా హిందీని అంగీ కరించబోమని, మరో భాషా యుద్ధానికి సిద్ధమని, బలవంతంగా హిందీని రుద్దటాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. అయితే నూతన విద్యావిధానంలో అనేక అంశాలూ అంగీకరించలేమని కూడా తేల్చి చెప్పారు. విద్య ఉమ్మడి జాబితాలోనిదని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రతిగా కేంద్రం, ఎన్.ఈ.పి.ని, త్రిభాషా సూత్రం అమలుచేయని యెడల సర్వశిక్షా అభియాన్ నిధులు విడుదల చేయ బోమని నిధులు నిలిపివేసింది. ఇది రాజ్యాంగ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని నిరసనలు మొదలయ్యాయి. తమిళనాడులోని బీజేపీ నేత, నటి రంజనా నాచియార్ ఈపాలసీని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మూడు భాషలను విద్యార్థులపై రుద్దడం చాలా తప్పనీ ఆమె తెలిపారు. హిందీ అధికారభాషే కానీ, జాతీయ భాష కాదని ఆమధ్య తమిళనటుడూ ఓ ప్రకటన చేశాడు. హిందీభాష గురించి, దాని అమలు గురించీ ఇంత వివాదం జరుగుతున్నా అసలు ప్రభుత్వ పాలన, ఇతర వ్యవహారాలన్నీ, రాష్ట్రాల్లో, కేంద్రంలో ఆంగ్లభాషలోనే సాగటం మనం చూస్తున్నాము. హిందీ ప్రాంతాల్లో హిందీ, ఆంగ్లభాషలే పాఠశాలల్లో బోధిస్తున్నారు. త్రిభాష సూత్రమేదీ అక్కడ పూర్తిగా అమలు కావడం లేదు. నేటి బోధనా ప్రమాణాలను పరిశీలిస్తే అన్ని భాషల నిబంధన ఏ భాషా సరిగా నేర్వలేని స్థితికి చేరింది.

2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూలు ప్రాంతాల్లో 22భాషలు ఉండగా వాటిలో 17భాషలు తిరోగమన బాట పట్టాయని, మాట్లాడే వారు తగ్గిపోతున్నారని, హిందీ, బెంగాలీ తర్వాత మూడవ స్థానంలో ఉన్న తెలుగు కూడా నాల్గవ స్థానానికి పడిపోయిందని పరిశోధకులు చెబుతున్నారు. మనదేశంలో సగటున రెండు నెలలకు ఒక భాష కను మరుగైపోతోందనీ గత యాభై ఏండ్లలో 283 భాషలు అదృశ్యమయ్యాయని వారు వివరిస్తున్నారు. ఉత్తర భారతంలో వందేండ్లలో 25 భాషలు కనుమరుగయ్యాయి. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి కూడా ఇదే వివరిస్తు న్నారు. హిందీని ఆధిపత్యంలోకి తీసుకువచ్చి, ఉత్తర భారతంలోని అనేక భాషలు-భోజ్‌పురి-మైథిలీ, అవధీ, బ్రజ్, బుందేలీ, గర్వాల్, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గడీ, సంథాల, ముండారీ మొదలైన భాషల న్నింటినీ మింగేశారు. యూపీ, బీహార్ హిందీ 'హార్ట్‌ల్యాండ్స్' కాదు. వారి నిజమైన భాషలు అవశేషాలుగా మిగిలా యని, భాషా అస్తిత్వాన్ని గుర్తు చేస్తున్నారు. తమభాషను కోల్పోయిన జాతి సజీవ సంస్కృతినీ కోల్పోతుంది.

భిన్నమైన సాంస్కృతిక వైవిధ్యాలను గుర్తించ నిరాకరిస్తూ భాషాధిపత్యాన్ని కొనసాగించాలనుకోవడం సరైనది కాదు. అందుకు ప్రతిఘటన కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. వైవిధ్యతలను వైరుధ్యాలుగా చేసి, వైశమ్యాలను పెంచే ప్రయత్నం వ్యతిరేకించాల్సిన అంశం. భాషలు ఎన్నయినా నేర్చుకోవచ్చు, వారివారి ఇష్టాలను బట్టి. ఒక భాషను ఇంకోభాషకు ప్రతిగా నిలపడం సరికాదు. భాషను కూడా మతతత్వానికి, ఆధిపత్యానికి ఉపయోగించుకుని మనుషుల మధ్య, ప్రాంతాల మధ్య విభజన తీసుకువచ్చి రాజకీయ ప్రయోజనాలను పొందాలనే ప్రయత్నాల్ని తిప్పికొట్టాల్సిందే. రాష్ట్రాల హక్కులను, సమాఖ్య విధానాలను గౌరవించి సమైక్యంగా ముందుకుపోవాలి.

# అసెంబ్లీ లో జగన్ కు ముందు సీటు కేటాయించిన రఘురామ

**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష హెూదా కోసం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కొంతకాలంగా పోరాడుతోంది. 2025 ఎన్నికల్లో 11 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే పరిమితమైన వైసీపీ, ప్రతిపక్ష హెూదా కోల్పోయింది. దీంతో, అసెంబ్లీలో జగన్‌కు ప్రతిపక్ష నేత హెూదా కల్పించాలన్న డిమాండ్‌ను కొనసాగిస్తోంది. గవర్నర్ ప్రసంగం రోజున అసెంబ్లికి హాజరైనప్పటికీ, ప్రతిపక్ష హెూదా ఇవ్వనందుకు నిరసనగా వైసీపీ సభ్యులు బాయ్ కాట్ చేసేశారు.

**కీలక నిర్ణయం**

ఈ నేపథ్యంలో, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలకు సీట్ల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా సీఎం, డిప్యూటీ సీఎం లకు ట్రెజరీ బెంచ్‌లో ముందు వరుస సీట్లు కేటాయిస్తారు. అదే విధంగా మంత్రులకు కూడా ముందు వరుసలోనే సీట్లు కేటాయించారు. మిగిలిన ఎమ్మెల్యేలకు సీనియార్టీ ప్రాతిపదికన వెనుక వరుసల్లో సీట్లు ఖరారు చేశారు.

**విపక్ష హెూదా**

విపక్ష హెూదా కోసం పోరాడుతున్న జగన్‌కు, విపక్ష ఎమ్మెల్యేల కూర్చొనే వైపు ముందు వరుసలో సీటు కేటాయించారు. దీనివల్ల అధికారికంగా ప్రతిపక్ష నేత హెూదా దక్కకపోయినా, అసెంబ్లీలో ఆయన కూర్చొనే సీటు మాత్రం ముందు వరుసలో ఉండనుంది. దీంతో విపక్ష నేత హెూదా దక్కకపోయినా ఆయన కూర్చొనే సీటు మాత్రం జగన్ కు దక్కినట్లయింది. ఇకపై అసెంబ్లీ సమావేశాల్లో ఈ సీట్ల ప్రకారమే



సభ్యులు కూర్చోవాల్సి ఉంటుంది. శాసన సభ సమావేశాలు జరిగిన రోజున తన పార్టీ కార్యాలయం నుంచే ప్రభుత్వాన్ని నిలదీస్తానని గతేడాది నవంబర్‌లో ఆయన మీడియా ఎదుట ప్రకటించారు. చెప్పినట్లుగానే సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రెస్‌మీట్లు పెట్టి ప్రభుత్వాన్ని విమర్శించారు.ప్రతిపక్ష హెూదా కోరుతూ గతంలో అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి, కొన్నాళ్లు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ సభ్యులు, అసెంబ్లీ సమావేశాల్లోనూ అదే గళాన్ని వినిపించారు.సమావేశాలు ప్రారంభమైన తర్వాత గవర్నర్ అబ్దుల్ నజీర్,ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తుండగా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష హెూదా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. నినాదాలు చేశారు.దాదాపు పది నిమిషాలకుపైగా నినాదాలు చేసి,వైఎస్ జగన్‌తో సహా ఆ పార్టీ సభ్యులందరూ బయటకు వచ్చేశారు.

మొదటి పేజీ నుంచి

## తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్

అన్నారు. 'గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌తో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ జైత్రయాత్ర మొదలు కావాలని కోరుకుంటున్నాను. రాష్ట్రంలో వాణిజ్యానికి ఉన్న అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్‌కు సహకారం అందిస్తాయి' అని ముఖ్యమంత్రి చెప్పారు. విస్తారమైన తీరప్రాంతం, లోతైన సముద్ర ఓడరేవులు, బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో ఆంధ్రప్రదేశ్... దేశీయ, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడానికి, గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మారడానికి ఆంధ్రప్రదేశ్ అనువైందని ముఖ్యమంత్రి అన్నారు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో రెండు వేల మందికి ఉపాధి కల్పించేలా ప్లాంట్ నెలకొల్పడంతో తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుంది. ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉంది. ఏడాదికి 206 టన్నుల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, వాతావరణంలోకి ఏడాదికి 190 నుచిం 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుంది. మొత్తంమ్మీద 8 శాతం నుంచి 10 శాతం ఉద్గార తగ్గింపు సాధ్యమవుతుంది.

**హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ :**

2012లో స్థాపించిన హీరో గ్రూపు పునరుత్పాదక ఇంధన విభాగం హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ పవన, సౌర, హైబ్రిడ్ ఇంధన వనరుల ఉత్పత్తిపై దృష్టి పెట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నిస్తోంది. భారతదేశం, యుకె, ఉక్రెయిన్, వియత్నాం, బంగ్లాదేశ్‌లో 1.9 గేగావాట్ సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్వహిస్తూ రూ.1,460 కోట్ల వార్షిక ఆదాయం సాధిస్తూ ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా, 2030 నాటికి సామర్థ్యాన్ని 30 గేగావాట్ కి పెంచడానికి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధంగా ఉంది.

**రాక్‌మాన్ ఇండస్ట్రీస్ :**

1960లో స్థాపించిన హీరో గ్రూప్‌లో భాగమైన రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ అల్యూమినియం డై-కాస్టింగ్ భాగాలు, అధునాతన కార్బన్ సంబంధిత ఆటో భాగాల తయారీదారు. లుధియానా, హరిద్వార్, చెన్నై, బవాల్, సూరత్, వడోదర, తిరుపతి ప్లాంట్లతో రూ.2,390 కోట్ల వార్షిక ఆదాయం కలిగి ఉంది. ఏరోస్పేస్, హై-ఎండ్ ఆటోమోటివ్ రంగాల్లోకి ప్రవేశించింది. ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఎండీ, ఛైర్మన్ రాహుల్ ముంజల్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీవాత్సన్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజల్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సీఈవో కౌసిక్ మన్నా, ఓహ్మియం సీఈవో ఆర్నే బాలంటైన్ పాల్గొన్నారు.

## ఉత్కంఠంగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

లెక్కిస్తున్నారు. 28 టేబుల్స్ 17 రౌండ్‌ల్లో కౌంటింగ్ జరుగుతుంది. చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లు వేరు చేసిన తర్వాత లెక్కింపు ప్రక్రియ చేపడతారు. రౌండ్ల వారీగా చెల్లుబాటైన ఓట్లను సిబ్బంది లెక్కిస్తున్నారు. మొదటి రౌండ్‌లో 10,783, రెండో రౌండ్‌లో 13,929, మూడో రౌండ్‌లో 11,870, నాలుగో రౌండ్‌లో 13,777, ఐదో రౌండ్‌లో 13,163, ఆరో రౌండ్‌లో 14,783 చెల్లుబాటు ఓట్ల లెక్కించారు. ఫలితం వెలువడటానికి కనీసం రెండు రోజులు పడుతుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద144 సెక్షన్ విధించారు. విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈఈఈ విభాగంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈఈఈ విభాగంలో ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తున్నారు. లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 100 మంది సిబ్బంది, 200 మంది పోలీసులు, 160 మంది కౌంటింగ్ ఏజెంట్లు కౌటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. తొలి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలితే సోమవారం రాత్రి ఎనిమిది గంటల్లోపే విజేత ఎవరో తెలిసే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో మొత్తం 22,493 మంది ఓటర్లు పాల్గొన్నారు. 92.40 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల బరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మతో సహా పదిమంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. రఘువర్మ, గాదె శ్రీనివాసుల నాయుడు, కోరెడ్ల విజయ గౌరీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలిమినేషన్ ప్రక్రియలో రెండో రౌండ్‌లో అభ్యర్థి శివప్రసాదరావు, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగో రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో ఆర్.సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో ఎస్.శ్రీనివాసరావు ఎలిమినేట్ అయ్యారు. 6వ రౌండ్‌లో గాదె శ్రీనివాసులుకు 7,233 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,870 ఓట్లు వచ్చాయి.౦ఎ

## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు

ఫిగర్ సాధించారు. ఓట్ల లెక్కింపులో 8 మంది అభ్యర్థులను ఎలిమినేట్ చేసిన అధికారులు దాదాపు 11 గంటల పాటు నిరంతరాయంగా ఓట్లను లెక్కించి గాదె శ్రీనివాసులు నాయుడుని విజేతగా ప్రకటించారు. శ్రీనివాసులునాయుడుకు బిజెపి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏపిటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు టిడిపి మద్దతుగా నిలిచింది. గుంటూరు - కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ రెండవ రౌండ్ ముగిసే సరికి 20, 746 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైంది. మొత్తం 2,18,902 ఓట్లు పోలయ్యాయి. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బందితో ఓట్లు లెక్కిస్తున్నారు. 28 టేబుల్స్ 17 రౌండ్‌ల్లో కౌంటింగ్ జరుగుతుంది. చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లు వేరు చేసిన తర్వాత లెక్కింపు ప్రక్రియ చేపడతారు. రౌండ్ల వారీగా చెల్లుబాటైన ఓట్లను సిబ్బంది లెక్కిస్తున్నారు. మొదటి రౌండ్‌లో 10,783, రెండో రౌండ్‌లో 13,929, మూడో రౌండ్‌లో 11,870, నాలుగో రౌండ్‌లో 13,777, ఐదో రౌండ్‌లో 13,163, ఆరో రౌండ్‌లో 14,783 చెల్లుబాటు ఓట్ల లెక్కించారు. ఫలితం వెలువడటానికి కనీసం రెండు రోజులు పడుతుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

## పెరుగుతున్న చికెన్ ధరలు

రూ.180లుగా ఉంది. మొన్నటి వరకు రూ.120 నుంచి రూ.130 మధ్య పలికిన ఈ ధర రూ.50 పెరిగింది.

## మెగా డీఎస్సీల ద్వారా త్వరలో 16,347 పోస్టుల భర్తీ చేస్తాం.. మంత్రి లోకేష్

పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌లో స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాలు, మంచి విద్య అందించడంలో ప్రణాళికలు వేస్తున్నామన్నారు. 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారని, గత ప్రభుత్వ నిర్వాకంతో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని విమర్శించారు. దీనికి ఓ ప్రత్యమ్నాయంపై సభ్యులతో చర్చించాలని నిర్ణయించామన్నారు. ఈరోజు మధ్యాహ్నం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులన్ని పూర్తిచేస్తామన్నారు. 117 జీవోకు ప్రత్యమ్నాయంగా తీసుకువచ్చే జీవో ఆధారంగా సభ్యుల సలహాలతో ముందుకు వెళతామని తెలిపారు. నాడు నేడుపై ఆరోపణలు వచ్చాయని, నాణ్యత లేదన్నారని, దీనిపై రిపోర్టు తీసుకుని యాక్షన్ తీసుకుంటామని మంత్రి లోకేష్ వెల్లడించారు. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సీసీ టివీలు, లైటింగ్ పాఠశాలల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఆఫ్ ఏపీ కింద సీఎస్ఆర్ నిధులు తెచ్చి అభివఅద్ధి చేయాలన్నారు. డిప్యూటీ సీఎం ఎలా అయితే సీఎస్ఆర్ ద్వారా అభివఅద్ధి చేస్తున్నారో అలా మనం కూడా చేద్దామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రకటన విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో నాలుగవ ప్రశ్న వైసీపీ సభ్యులు అడిగారు. వారికి సమాధానం ఇస్తాను అని డిప్యూటీ స్పీకర్ ను మంత్రి లోకేష్ అభ్యర్థించారు.

## ఏపీ లో మండలి నోటిఫికేషన్ జారీ

గెజిట్ విడుదల చేసింది. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తర్వాతే ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉండటంతో, ఎన్నికల కమిషన్ ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.ఈ ఐదు ఎమ్మెల్సీ సీట్లకు ఎన్నికల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది.

ఎన్నికల **షెడ్యూల్ ప్రకారం:**

మార్చి 4: నోటిఫికేషన్ విడుదల
మార్చి 10: నామినేషన్ల స్వీకరణకు చివరి తేది
మార్చి 11: నామినేషన్ల పరిశీలన
మార్చి 13: నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేది
మార్చి 20: ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలుసాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.అదే రోజు ఫలితాల ప్రకటన.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా తాజాగా జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కూడా రాజకీయ పార్టీలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. ఏపీలో ఇంకో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతుండగా, రాజకీయంగా ఈ ఎన్నికల ఫలితాలు కీలకంగా మారనున్నాయి. మార్చి 20న ఓటింగ్ పూర్తయి అదే రోజు ఫలితాలు వెల్లడికానుండటంతో, అన్ని పార్టీలూ తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి.

**శాసన మండలి**

భారత రాజ్యాగంలోని ఆర్టికల్ 169 ఒక రాష్ట్రంలో శాసన మండలి ఏర్పాటు, రద్దు అంశాలను వివరిస్తోంది. శాసన మండలి ఉండాలా వద్దా అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం.1958లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా శాసన మండలి ఏర్పాటైంది. అయితే, 1985లో ఎన్టీఆర్ ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది. ఆ తర్వాత 2007లో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మండలి ఏర్పాటయింది.ప్రస్తుతం దేశంలో కేవలం ఆరు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్) మాత్రమే శాసన మండళ్లున్నాయి.మొత్తం అసెంబ్లీ సభ్యుల్లో మూడో వంతు సంఖ్యతో శాసన మండలి ఏర్పాటవుతుంది. ఇది శాశ్వత సభ. సభ్యుల పదవీ కాలం ఆరేళ్లు. ప్రతి రెండేళ్లకు మొత్తం సభ్యుల్లో మూడోవంతు మంది పదవీ కాలం ముగుస్తుంది.మొత్తం సంఖ్యలోమూడో వంతు సభ్యులను స్థానిక సంస్థల ప్రతినిధులు, మరో మూడో వంతు సభ్యులు ఎమ్మెల్యేల ద్వారా, ఆరోవంతు సభ్యులు గవర్నర్ ద్వారా నామినేట్ అవుతారు. పన్నెండో వంతు సభ్యులు పట్టభద్రులు, మరో పన్నెండు వంతు సభ్యులు ఉపాధ్యాయుల ద్వారా ఎన్నికవుతారు.

## మార్చి7న ఏపీ క్యాబినెట్ భేటీ

కార్యక్రమాలకు సంబంధించిన కీలక విషయాలు క్యాబినెట్ ముందుకు రానున్నాయి. ముఖ్యంగా, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి అభివృద్ధి, ఉపాధి హామీ పథకాలు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.

**కేంద్రంతో సంబంధాలను మెరుగుపరచుకోవడం**

క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్ బకాయిల అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. కేంద్రంతో సంబంధాలను మెరుగుపరచుకోవడం, రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులను సక్రమంగా వినియోగించడం అనే లక్ష్యంతో, ప్రభుత్వం కీలక వ్యూహాలు రూపొందించనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో, ప్రజలకు ప్రయోజనం కలిగించే పథకాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వనుందని అంచనా.

**ముఖ్యమైన నిర్ణయాలను అధికారికంగా ప్రకటించే అవకాశం**

ఈ సమావేశం అనంతరం ముఖ్యమైన నిర్ణయాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న చర్చల ప్రభావం ఈ సమావేశంపై ఉండే అవకాశం ఉంది. ఏపీ అభివృద్ధికి సంబంధించి తీసుకునే కీలక నిర్ణయాలపై అన్ని వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

మంగళవారం
04 మార్చి 2025
జనరల్ న్యూస్

జనరల్ న్యూస్

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com



# విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం శంకుస్థాపన

**అమరావతి మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ నడిపిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయి. త్వరలోనే విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ఏర్పాటు కానుంది. ఈ నెల 6న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్న ట్రస్ట్ భవన్ నుంచి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇప్పుడు విజయవాడలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషం.

**ఎక్కడ నిర్మించనున్నారు?**

ఈ భవనం కోసం 16వ జాతీయ రహదారిపై నున్న ఎల్‌ఈపీఎల్ మాల్ పక్కన, సాయిబాబా ఆలయ రోడ్డు జంక్షన్‌లో 600 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో జీప్లస్ 5 ఫ్లోర్స్ భవనంగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ భవనంలో ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంతో పాటు, వివిధ సేవా కార్యక్రమాలు, విద్య, వైద్య సహాయానికి సంబంధించిన కార్యాలయాలు ఉండనున్నాయి.

**ఎందుకు విజయవాడ?**

విజయవాడ ఆంధ్రప్రదేశ్ పొలిటికల్, కమర్షియల్ హబ్ కావడంతో, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు సమీపంగా ఉంటుంది. ఎన్టీఆర్ కుటుంబానికి విజయవాడతో అనుబంధం ఎక్కువ. ప్రస్తుతం హైదరాబాద్ ట్రస్ట్ భవన్ నుంచి నిర్వహించే సేవా కార్యక్రమాలను రాయలసీమ, కోస్తాంధ్రకు మరింత చేరువ చేయడానికి ఈ కేంద్రం ఉపయోగపడనుంది. భవనం పూర్తయిన తర్వాత, ఇక్కడి నుంచే ట్రస్ట్ ప్రధాన కార్యకలాపాలను నిర్వహించనున్నారు.

**ఏ మార్పులు జరగబోతున్నాయి?**

ప్రస్తుతం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను విజయవాడ కార్యాలయానికి బదిలీ చేయనున్నారు. అవసరాన్ని బట్టి స్థానికంగా కొత్త ఉద్యోగులను నియమించనున్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన అవుట్‌రీచ్ కార్యక్రమాలను విజయవాడలో విస్తరించనున్నారు.

**ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు?**

ఎన్టీఆర్ ట్రస్ట్ దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా విద్యా సహాయం %-% పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫౌండేషన్ స్కూల్స్ వైద్య సేవలు %-% ఉచిత వైద్య శిబిరాలు, రక్తదానం, అత్యవసర వైద్య సదుపాయాలు. ఆపత్కాల సహాయం %-% సహాయ నిధులు, భూ ప్రకంపనలు, తుఫానులు వచ్చినప్పుడు సహాయక చర్యలు. ఆర్థికంగా వెనుకబడిన వారికి మద్దతు - నిరుద్యోగులకు శిక్షణ, మహిళా సాధికారత కార్యక్రమాలు. వీటిని విజయవాడ కేంద్రంగా మరింత విస్తృతంగా అమలు చేయనున్నారు. ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి నేరుగా ట్రస్ట్ సేవలను పొందే అవకాశం ఉంటుంది.

**నారా భువనేశ్వరి - ఎన్టీఆర్ ట్రస్ట్ వ్యూహం**

నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నారు.
ఇప్పటికే ట్రస్ట్ నడుపుతున్న ఆరోగ్య, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలు విజయవాడ కేంద్రం ద్వారా మరింత బలోపేతం కానున్నాయి. భవనం నిర్మాణంతో పేదలకు వైద్య, విద్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. ఇకపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో సేవా కేంద్రాలను పెంచేందుకు ప్రయత్నం చేయనున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ విజయవాడలో భవనం ఏర్పాటు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలకు మరింత బలం చేకూర్చనుంది. ట్రస్ట్ సేవలను విస్తరించి, సామాజిక సంక్షేమంలో మరింత అంకితభావంతో ముందుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. విజయవాడలో కేంద్రం ఏర్పాటు టిడిపికి బలాన్ని చేకూరుస్తుందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

## వ్యవసాయ కనెక్షన్లకు, ఉచిత విద్యుత్‌కు

# రూ.12,400 కోట్ల వ్యయం



- **పగటి పూటే రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా**
- **కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే రైతులకు 22,709 కనెక్షన్ల ఏర్పాటు**
- **ఇప్పటి వరకు 69,975 వ్యవసాయ కనెక్షన్ల మంజూరు**
- **ఇప్పటికే లక్ష పీఎం కుసుమ్ కనెక్షన్లు, కేంద్ర సహకారంతో త్వరలో 2 లక్షలు**
- **విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**గుంటూరు మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా... అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖకు సంబంధించి గౌరవ సభ్యులు బత్తుల బలరామకృష్ణ, ఉగ్ర నరసింహారెడ్డి, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి సోమవారం సభలో సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు, ఉచిత విద్యుత్ కు ఏడాదికి రూ.12,400 కోట్లకు పైగా వ్యయం చేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 22,709 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని తెలిపిన మంత్రి గొట్టిపాటి... మొత్తం 69,975 కనెక్షన్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కూటమి ప్రభుత్వం రూ.2.60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా వివరించారు. డిస్కంల్లో విద్యుత్ ఉపకరణాల ధరలు తేడా ఉండడంపై గౌరవ సభ్యులు మాట్లాడిన విషయంపై మంత్రి గొట్టిపాటి స్పందించారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిందని మంత్రి విమర్శించారు. స్థంబాలు, ట్రాన్స్ మిషన్ లైన్లను అత్యధిక ధరలకు కొనుగోలు చేయడంతో మూడు డిస్కంల పరిధిలోని ధరల్లో వ్యత్యాసం ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపకరణాల కొనుగోలు ధరల్లో మార్పులు లేకుండా స్థిరీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

**పగటి పూటే రైతులకు 9 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా...**

పీఎం కుసుమ్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో... రైతులకు పగటి పూట పూర్తి స్థాయి విద్యుత్ సరఫరాలో కొన్ని ఆటంకాలు ఏర్పడిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం పీఎం కుసుమ్ పథకం ద్వారా అతి త్వరలోనే రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ను నిరంతరాయంగా అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 4.50 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరం అని అంచనా వేసిన మంత్రి... ఇప్పటికే లక్ష పీఎం కుసుమ్ కనెక్షన్లకు మంజూరయ్యాయని తెలిపారు. మరో రెండు లక్షల కనెక్షన్లకు సంబంధించి కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలు పెడుతున్నామని ఆయన తెలిపారు.

అల్యూమినియం ట్రాన్స్ ఫార్మర్లతో దొంగతనాలకు అడ్డుకట్ట... రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. లో ఓల్టేజ్ తో పాటు అధిక లోడ్ సమస్యలను పరిష్కరించేందుకు మూడు డిస్కంల పరిధిలో త్వరలోనే 70 సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పల్నాడు, ప్రకాశం, బాపట్ల ప్రాంతాల్లో జరుగుతున్న ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాలను నిలువరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్ ఫార్మర్లలో ఉండే రాగి వైరు కోసమే దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై అల్యూమినియం ట్రాన్స్ ఫార్మర్లను వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదే విధంగా ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాల విషయంలో వెంటనే కేసులు నమోదు అయ్యేలా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించామని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు. రాబోయే వ్యవసాయ సీజన్ సమయానికి రైతులకు విద్యుత్ శాఖ పరంగా ఎటువంటి ఇబ్బందీ లేకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు.



# ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం - ఎస్పీ

## పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమంకు 78 ఫిర్యాదులు

**ఒంగోలుమార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మరియు పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలు వారి ఫిర్యాదుల గురించి జిల్లా ఎస్పీ మరియు పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. నడవలేని పరిస్థితిలో వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అందిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఉద్యోగాల కోసం ఎదురుచూసే యువత అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొంత మంది వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సులభంగా వారిని మోసం చేస్తున్నారని, అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మాయ మాటలు చెప్పి జాబ్ మోసాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..తన కుమార్తె వివాహం/చదువు నిమిత్తం దాచుకున్న ఐదు లక్షలు డబ్బులు చీమకుర్తి మండలానికి చెందిన ఒక వ్యక్తి గృహం కొనుగోలు నిమిత్తం అప్పుగా తీసుకొని నాలుగు నెలలు తిరిగి ఇస్తానని చెప్పి, మూడు సంవత్సరాల గడుస్తున్నా ఇవ్వటం లేదని, డబ్బులు అడుగుతుంటే దాడి చేయటానికి వస్తున్నారని నేలటూరుకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు.తనతో పాటు మరో ఐదుగురికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఎంప్లాయిమెంట్ ఆఫీస్ కు చెందిన ఒక వ్యక్తి ఒక్కొక్కరి వద్ద నుండి రూ.1,50,000/- డబ్బులు తీసుకొని, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేయడమే కాకుండా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తనకు న్యాయం చెయ్యమని దర్శి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ యన్.శ్రీకాంత్ బాబు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీకాంత్, సి.సి.ఎస్ సీఐ జగదీష్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.






# హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించిన సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

**ఏలూరు, మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సి ఆర్ ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోడ్డుప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్లే కార్డుల ప్రదర్శన ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమం ఉదయం 10 గంటలకు స్కూలు ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన ముఖ్య సందేశాలు గా హెల్మెట్ - ప్రాణాలను కాపాడే కవచం! మీ కుటుంబానికోసం హెల్మెట్ ధరించండి సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్ తప్పనిసరి ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ ఉపయోగించండి అని ఫ్లాకార్డుల ను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు తల్లిదండ్రులను మరియు ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ఉపయోగంపై చైతన్యం కల్పించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు హెల్మెట్ ఉపయోగం వల్ల గాయాల తీవ్రత తగ్గుతుందని, రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించుకోవచ్చని వివరించారు.

# రేషన్ లబ్ధిదారులకు మెరుగైన సర్వీస్ లను అందించండి.

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి.



**భీమవరం, మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రేషన్ లబ్ధిదారులకు మెరుగైన సర్వీస్ లను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం మండలం చినమిరం గ్రామంలో 62 నెంబరు రేషను షాపును జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న సరుకులు ప్రకారం స్టాకు రిజిస్టరును, కార్డు దారులకు పంపిణీ చేసే రికార్డులను పరిశీలించారు. ఎండియు వాహనముపై సరుకులు వివరాలు రేట్లు పట్టికను పరిశీలించారు. ఈ సంధర్భంగా పలువురు కార్డుదారులు ఇంటి వద్దకు వెళ్ళి మాట్లాడారు. పంపిణీ తీరుపై ఆరా తీసి, ఏఏ సరుకులు ఎంత మేర ఇస్తున్నారు కార్డులో ఎంతమంది సభ్యుల ఉన్నారు ప్రతి నెల క్రమం తప్పకుండా రేషన్ సరుకులు తీసుకుంటున్నారా అడిగి తెలుసుకున్నారు. ఇచ్చే ధరలు, పంపిణీపై కార్డు దారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంపిణీ విధానంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ షాపులో ఉన్న స్టాకు పంపిణీ చేసిన సరుకులు వివరములు రికార్డును ప్రకారం ఖచ్చితంగా ఉండాలన్నారు. నిరుపేద ప్రజలకు అందించే నిత్యవసర సరుకులు ఏటువంటి పొరపాట్లు జరగకూడదన్నారు. క్రమం తప్పకుండా రేషన్ షాపులు, ఎండియు వాహనం సరుకులు పంపిణీపై పర్యవేక్షణ చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంలో సివిల్ సప్లై రెవిన్యూ ఇన్స్పెక్టరు ఏ.సురేష్, వీఆర్వో శ్రీనివాసు,సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఘనంగా నర్సరీ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

## కొలువు తీరిన నూతన పాలకవర్గం



**కడియం, మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహెూత్సవం వైభవంగా జరిగింది. స్థానిక జిఎన్ఆర్ కన్వెన్షన్ లో జరిగిన ఈ ప్రమాణస్వీకారం వేడుకలకు పెద్ద ఎత్తున మంత్రులు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన పాలకవర్గాన్ని అభినందనలతో ముంచేస్తారు.శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.రత్నం అయ్యప్ప అధ్యక్షులుగా ఉన్న ఈ పాలకవర్గాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఫోటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గం వివరాలు ఇలా ఉన్నాయి.రత్నం అయ్యప్ప (ప్రెసిడెంట్), బోడపాటి గోపాలకృష్ణ (వైస్ ప్రెసిడెంట్),కొండేపూడి నాగు (జనరల్ సెక్రెటరీ,తాడాల నాగేశ్వరరావు (సెక్రటరీ) ,గాజులు రత్తయ్య (జాయింట్ సెక్రటరీ),రత్నం మహాలక్ష్మి నాయుడు (ట్రెజరర్),పిల్లా శ్రీనివాస్ (జాయింట్ ట్రెజరర్),పాఠంశెట్టి శేషు కుమార్ (కో-ఆర్డినేటర్),బోడపాటి సత్యనారాయణ (పిఆర్ఓ),గాద నాగేశ్వరరావు (డైరెక్టర్) ,అడ్డగర్ల రమేష్ (డైరెక్టర్),మల్లు శివ నారాయణ (డైరెక్టర్) ,క్రొవ్విడి వాసు (కో-ఆప్షనల్ మెంబర్)

# జిల్లా వ్యాప్తంగా కొరియర్ సర్వీసెస్, ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలపై ఆకస్మిక తనిఖీలు, సోదాలు...

**కాకినాడ, మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్న కొరియర్ సర్వీసెస్, రవాణా ఏజెన్సీలపై అకస్మిక తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు.ఈ సోదాలలో పోలీస్ జగిలాలు, బాంబులను నిర్వీర్యం చేసే విభాగం, స్థానిక పోలీస్ లు పాల్గొనుచున్నారు.కొరియర్ సేవలు, రవాణా సేవలు అందించే ఆఫీస్ లను తనిఖీ దీపావళి బాణాసంచ, పేలుడు సంభవించే గుణం గల రసాయనాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి కోసం సోదాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వస్తువులపై ఆరా తీస్తున్నారు.పేలే గుణం గల రసాయనాలు, పదార్థాలను %ట% మత్తు, మాదక ద్రవ్యాల వంటి పదార్థాలను రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ తెలియచేసారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 04 మార్చి 2025



### ఘనంగా కోనసీమ ముద్దుబిడ్డ

## బాలయోగి వర్ధంతి

**అల్లవరం మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామం రజకపేటలో ఎన్డీఏ కూటమి నాయకులు రొక్కాల నాగేశ్వరావు ఆధ్వర్యంలో కోనసీమ ముద్దుబిడ్డ జిఎంసి బాలయోగి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జిఎంసి బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధి జరిగిందంటే మాజీ లోక్ సభ స్పీకర్ స్వర్గీయ జిఎంసి బాలయోగి కృషినని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, జనసేన గ్రామాకమిటి అధ్యక్షులు రోళ్ల శ్రీను, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీను, అడపా శ్రీను, ఒలేటి పరమేశ్వరరావు, మోయిల గణపతి, చుట్టుగుళ్ల నిలకంతం, మల్లిపూడి నవీన్, దొమ్మేటి రాజు, కారెం ప్రసాద్, దొమ్మేటి భావన్నా, ముత్యాల దుర్గారావు, దొమ్మేటి రాధాకృష్ణ, ఎలకతురి తాతాజీ, రొక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

### పదవతరగతి విద్యార్థులకు

## పరీక్ష కిట్లు పంపిణీ




**అల్లవరం మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రుద్రరాజు సీతాపతి రాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటిబుల్ ట్రస్ట్ గోడిలంక మరియు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటిబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోడిలంక మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూర్పులంక నందు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష కిట్లును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ద్వారా అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి.వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు లు విద్యార్థులు బాగా చదువుకుని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా వ్రాయాలని కొన్ని మెళుకువలు,సూచనలు చేశారు.ఈ సంవత్సర పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయి ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించబోవు విద్యార్థులకు రూ. 15వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ట్రస్ట్ ల అధ్యక్షులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ బేగం, యు.మల్లపురాజు, ఉపాధ్యాయులు ఎమ్.విజయకుమారి, కె. ఎన్ గణేష్, రమా సత్యవతి, బి.నకులరాజు, దివాకర్ శ్రీనివాసన్, సురేష్, కె.నాగవేణి, భాగ్యలక్ష్మి, రమేష్ ,కె.సత్యనారాయణ, ఎమ్ . శ్రీనివాస్ మరియు డాక్టరు మోసుగంటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## బాలయోగికి ఘన నివాళి అర్పించిన టిడిపి నాయకులు



**అయినవిల్లి, మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అయినవిల్లి, మార్చి 3 ( గోదావరి విలేఖరి) : భారతదేశపు తొలి దళిత లోక్ సభ స్పీకర్ దివంగత జి.ఎం.సి.బాలయోగి వర్ధంతి మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాల్వ గట్టు , ఎంపిడిఓ కార్యాలయాల వద్దగల బాలయోగి విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటుకు ఉండే శక్తిని ప్రపంచదేశాలకు చాటిన మహోన్నత నేత బాలయోగి అని శ్లాఘించారు. అవకాశమిస్తే తమ ప్రతిభను చాటేసత్తా దళిత నాయకులకు ఉందని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం బాలయోగి సొంతమని వివరించారు. అనంతరం బాలయోగి అమర్ రహై బాలయోగి ఆశయాలను కొనసాగిస్తాం, జోహార్ జి.ఎం.సి. బాలయోగి అని నినాదాలు చేసారు,ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కుడిపూడి బుజ్జి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపు రాజు సత్తిబాబు రాజు,టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్, విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర నాయకుడు కళ్ళేపల్లి సుబ్బరాజు, సర్పంచ్ కాకర బాబ్జి ,మండల తెలుగు యువత అద్యక్షుడు మేడిశెట్టి అంజిబాబు, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వార రాము, మాజీ ఎంపిటిసి ఓంసద్గురు ప్రసాద్, రమేష్ రాజు, వర్మ, కాగిత సత్యనారాయణ, నాగారపు గంగాధర్ రావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# జోహార్ బాలయోగి

## బాలయోగికి ఘన నివాళి





**అమలాపురం మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ అభివృద్ధి ప్రదాత, లోక్ సభ దివంగత సభాపతి జిఎంసి బాలయోగి 23వ వర్ధంతి సందర్భంగా జిల్లా వాసులు సోమవారం నాడు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. వాడవాడలా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి కోనసీమ ప్రాంతానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. జోహార్ బాలయోగి.. అంటూ నినదించారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు అమలాపురంతో సహా పలు నియోజకవర్గాలలో బాలయోగికి నివాళులు అర్పించారు. అమలాపురం బాలయోగి ఘాట్ లో స్వర్గీయ బాలయోగి తనయుడు, స్థానిక ఎంపి గంటి హరీష్ మాధుర్ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు దివంగత నేత బాలయోగికి నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మాజీ ఎంఎల్ఏ మానేపల్లి అయ్యాజీ వేమా, అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బిజెపి నాయకులు యాళ్ళ దొరబాబు, పాలూరి సత్యానందం, నల్లా పవన్ కుమార్, మోకా వెంకటసుబ్బారావు తదితరులు బాలయోగి ఘాట్ కు వచ్చి దివంగత నేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ స్వర్గీయ బాలయోగి గోదావరి జిల్లాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. బాలయోగి ఆశయాల సాధనకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు చెల్లి వివేకానంద, చిల్లా జగదేశ్వరి, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు నామన రాంబాబు, డొక్కా నాథ్ బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, గుత్తుల సాయి, మద్దాల సుబ్రహ్మన్యేశ్వరావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, అల్లవరం, అయినవిల్లి మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు, చిట్టూరి శ్రీనివాస్, జిల్లా తెలుగుయువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజు, రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ముత్యాల బాబ్జి, మాజీ ఎంపిపి బూసి జయలక్ష్మి, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, టిడిపి నాయకులు తాడి నరసింహారావు, చెల్లి అశోక్, నాగాబత్తుల శ్రీనివాసరావు, బొబ్బా ప్రభాత్, గణపతి రాఘవులు, జగడం సత్యనారాయణ, ముఖరం హుస్సేన్, మోకా పార్వతి, బందెల పద్మ, మట్టపర్తి భారతి తదితరులు బాలయోగికి నివాళులు అర్పించారు.



# పది పరీక్షా ఫలితాల్లో జిల్లాను నెంబర్ వన్‌గా నిలబెట్టాలి

## - డి.ఆర్.ఓ రాజకుమారి

**అమలాపురం మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉన్నత విద్యకు 10వ తరగతి పునాది, తొలిమెట్టని 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి సూచించారు. సోమవారం అమలాపురం డి.ఆర్.ఓ కార్యాలయంలో 10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఆమె జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 19,217, మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులకు పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టి, వారిలో స్ఫూర్తిని నింపాలన్నారు. ప్రథమస్థానం సాధించేలా విద్యార్థులను సమాయత్తం చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పరీక్షలకు ఇంకా 13 రోజులు మాత్రమే సమయం ఉందని, ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలు పాటిస్తే తప్పకుండా అందరూ ఉతీర్ణులు అవుతారని తెలిపారు. ఇంజనీరింగ్, డాక్టర్, కలెక్టర్ తదితర ఉద్యోగాలకు తొలిమెట్టు 10వ తరగతి ఉత్తీర్ణతేనని మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో కోరుకున్న ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుందన్నారు. కొన్ని పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు పరీక్షా కేంద్రాల రూట్లలో బస్సులు నడపాలని, ట్రాన్స్ కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలని, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓలు పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, పోలీసు అధికారులు ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలు తరలింపులో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మాస్ కాపీయింగ్, ఫేక్ న్యూస్ వంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య శాఖ అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం బాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.హనుమంతరావు, ఉప విద్యా శాఖ అధికారి జి.సూర్య ప్రకాశం, పోస్టల్, ఆర్టీసీ, ట్రాన్స్ కో అధికారులు పాల్గొన్నారు.





# చిరస్మరణీయుడు బాలయోగి

**కాత్రేనికోన మార్చి 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కోనసీమ అభివృద్ధి ప్రదాత, ముమ్మిడివరం ముద్దుబిడ్డ, దివంగత లోక్ సభ స్పీకర్ జి.ఎం .సి బాలయోగి వర్ధంతి కార్యక్రమం మండలంలో అన్న సోమవారం ఘనంగా నిర్వహించారు. చెయ్యేరు గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ చెల్లి సురేష్ ఆధ్వర్యంలో బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిరస్మరణీయుడు బాలయోగి అని , ఆయన కోనసీమ ప్రాంతానికి చిరస్థాయిలో నిలిచిపోయే అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు ఆయన కుమారుడు, ప్రస్తుత ఎంపీ హరీష్ మాధుర్ తీరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ త్సవపల్లి సీఎం, మోర్త శ్రీనివాస వర్మ, గిడ్డి చంటి, ఉచ్చులనారాయణ (డాన్), బాలు యాదవ్ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అమలాపురంలో ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ పోలిటెక్నిక్ కాలేజి మంజూరు చెయ్యలని విద్యా శాఖా మంత్రి లోకేష్‌ని కలిసి కోరిన గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

# శాసన మండలిలో అధికారపక్షం కుప్పిగంతులు : బొత్స ధ్వజం



**విజయవాడ: దేశ చరిత్రలో సీఎం హోదాలో చంద్రబాబు మాట్లాడినట్లు ఎవరూ మాట్లాడలేదని సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. సోమవారం శాసన మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు.**

'దేశ చరిత్రలో సీఎం హోదాలో చంద్రబాబు మాట్లాడినట్లు ఎవరూ మాట్లాడలేదు. రుషికొండ భవనాల నిర్మాణంలో అవినీతి జరిగితే కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించారు? అని ప్రశ్నించారు. రుషికొండ నిర్మాణలపై విచారణకు సిద్ధం ఉన్నామని బొత్స స్పష్టం చేశారు. శాసన మండలిలో అధికారపక్షం కుప్పిగంతులేసింది. సచివాలయ భవనాలపై మంత్రి అచ్చెన్నాయుడికి క్లారిటీ లేదు. తాత్కాలిక భవనాలు అని ఎప్పుడూ చెప్పలేదని అచ్చెన్నాయుడు చెబుతున్నారు. అలాంటప్పుడు కొత్తగా నిర్మాణాలకు టెండర్లు పిలవడమెందుకు. వైఎస్సార్‌సీపీ వాళ్లకు పనిచేయొద్దని ముఖ్యమంత్రి ఎలా చెబుతారంటే సమాధానం లేదు. చంద్రబాబు మాదిరి ఇంత వరకూ ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదు. లబ్ధిదారుల్లో పార్టీలు చూడటమేంటి. రుషికొండ భవనాల్లో అక్రమాలు జరిగితే ఎందుకు బిల్లులు చెల్లించారు.నిజంగా అవినీతి జరిగితే ఎంక్వైరీ వేయండి. రాజధాని కోసం సుమారు మూడు నాలుగు లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం రాజధానికి రూ.6 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. బడ్జెట్ పై చర్చను డైవర్ట్ చేయడానికి టీడీపీ సభ్యులు ప్రయత్నం చేశారు.ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాయాల్సిన అవసరం మాకేంటి. అధికారంలో ఉన్నది వాళ్లా..మేమా. ఆడలేక మద్దెల ఓడ అన్నట్లుంది కూటమి నేతల తీరు'అని మండిపడ్డారు.

# 'అర్జెంట్‌గా పిల్లల్ని కనండి'

## తమిళ ప్రజలకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి



**చెన్నై: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు.**

నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. అందుకే నేను కోరుకునేది ఒక్కటే. కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి" అని సీఎం రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇటీవల కొళత్తూర్‌లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. "పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### గంజాయి నిర్మూలన కోసమే

# ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థ: మంత్రి అనిత



**అమరావతి: గత ప్రభుత్వ హయాంలో గంజాయి సాగు, రవాణా విచ్చలవిడిగా జరిగిందని ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. గంజాయి నిర్మూలన కోసమే ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారిని విభాగాధిపతిగా నియమించి.. 'ఈగల్'కు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని అనిత తెలిపారు.**

"11వేల ఎకరాల గంజాయి సాగును 100 ఎకరాలకు నియంత్రించాం. రాష్ట్రవ్యాప్తంగా 7 మండలాల్లోని 375 గ్రామాల్లో 20 హాట్‌స్పాట్‌లను గుర్తించి సాగు లేకుండా చేశాం. గంజాయి సాగుకు అలవాటుపడిన కుటుంబాలకు కౌన్సెలింగ్ చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించాం. అలా 359 కుటుంబాలు ఇప్పుడు గంజాయికి బదులు ఇతర పంటలను పండిస్తున్నారు. ఏపీలో గంజాయి సాగు కన్నా రవాణా ఎక్కువగా జరుగుతోంది. హోం శాఖ, ఈగల్ ఆధ్వర్యంలో అంతర్గత సమన్వయ సమావేశం కోసం స్టేట్ లెవల్ కమిటీ ఏర్పాటు చేశాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో స్కూళ్లలోనూ ఈగల్ కమిటీలను ఏర్పాటు చేశాం. గంజాయి సమాచారం అందిన వెంటనే టీచర్లు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో డీఎడిక్షన్ సెంటర్లలో చేర్పించే ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏపీలో 44 డీఎడిక్షన్ సెంటర్లు ఉన్నాయి" అని మంత్రి వివరించారు.

# గిర్ అడవుల్లో ప్రధాని మోదీ సఫారీ

**గిర్ : ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులోభాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు.**





గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ ఆదివారం రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహమైన సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం.

**ప్రాజెక్ట్ లయన్ కోసం రూ.2,900 కోట్లు**

ఆసియాటిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం.. ఆసియాటిక్ సింహాలు గుజరాత్‌లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

### టారిఫ్‌ల ఆందోళన వేళ..

# గోయల్ ఆకస్మిక అమెరికా పర్యటన

**అమెరికా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై పరస్పర సుంకాలు విధిస్తామని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం తన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకొని ఆకస్మికంగా అమెరికాకు బయలుదేరారు. మే 8 వరకు ఆయన అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఆయన ఆకస్మిక అమెరికా పర్యటనపై పూర్తి వివరాలను కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించలేదు.**



ప్రతిపాదిత సుంకాల గురించి అగ్రదేశాన్ని స్పష్టత కోరడం, వాటివల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం వంటి విషయాలతో సహా సుంకాల తగ్గింపు, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు వంటి వాటిపై కేంద్రమంత్రి దృష్టిపెట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. "భారత్ ఆటోమొబైల్స్, రసాయనాలు వంటి పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అగ్రదేశంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉంది. అయితే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని అమెరికా చేస్తున్న ఒత్తిడికి ఏమాత్రం లొంగేందుకు సిద్ధంగా లేదు. ఎందుకంటే వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గిస్తే దేశంలోని రైతులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి" అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. హై-ఎండ్ మోటార్ సైకిళ్లపై సుంకాలు 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇతర టారిఫ్‌లను సమీక్షిస్తామని, ఇంధన దిగుమతులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. అమెరికా నుంచి మరిన్ని రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అమెరికా భారత్‌పై విధించే పరస్పర టారిఫ్‌ల వల్ల భారతదేశానికి సంవత్సరానికి 7 బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక సైతం వెల్లడించింది. పధాని నరేంద్ర మోదీ ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా ఇరు దేశాధినేతలు దౌత్య, వాణిజ్య, రక్షణ సంబంధాలపై చర్చలు జరిపారు. ఈనేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ.. టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని ప్రధాని నరేంద్రమోదీతో స్వయంగా చెప్పినట్లు పేర్కొన్నారు. అమెరికా నుంచి చేసుకొనే దిగుమతులపై భారత్ అత్యధిక పన్నులు వేస్తోందని, ఇకపై తామూ అదేరీతిలో వ్యవహరిస్తామని తేల్చిచెప్పారు.

### కాలుష్య రహిత నగరంగా

# విశాఖను తీర్చిదిద్దుదాం

**నగర మేయర్**
**గొలగాని హరి వెంకటకుమారి**

**కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుటకు ప్రజలందరూ సహకరించాలని, విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరు వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలను విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విశాఖ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తమ క్యాంపు కార్యాలయం నుండి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఏపీఎస్ఆర్టీసీ బస్సులో జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ ఆమె స్ఫూర్తినిచ్చారు.**



ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలను విడనాడి ప్రజా రవాణాలను ఉపయోగించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపధ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమాలలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి అనేక అవగాహనా పరమైన కార్యక్రమాలు నిత్యం చేపట్టడం జరుగుతోందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను లేదా సైకిళ్లను ఉపయోగించడం వలన విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చునని అందుకు అందరూ సహకరించాలని నగర మేయర్ విజ్ఞప్తి చేశారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
మంగళవారం
04 మార్చి 2025
జనరల్ న్యూస్

# జగనన్న ఇళ్ల పథకం పెద్ద కుంభకోణం

## లబ్ధిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవకతవకలు - రెవిన్యూ మంత్రి అనగాని



అమరావతి మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో వైసీపీ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై వైసీపీ ఎమ్మెల్సీలు రాజశేఖర్, హనుమంతురావు అడిగిన ప్రశ్నలకు సోమవారం శాసనమండలిలో రెవెన్యూ మంత్రి అనగాని సమాధానమిచ్చారు. అందరికీ ఇళ్ల పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలను అందజేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇళ్ల పట్టాల కోసం 70,232 దరఖాస్తులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇవ్వగా కూటమి ప్రభుత్వం రెండు, మూడు సెంట్ల స్థలం ఇస్తోందని తెలిపారు. అంతేకాక ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోందన్నారు. జగనన్న ఇళ్ల పథకం పెద్ద కుంభకోణంలా మారిందని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. లబ్దిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధనవంతులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు, అనుయాయులకు ఇళ్ల పట్టాలు పంచి పెట్టారని మండలిలో వెల్లడించారు. ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులోనూ పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని మంత్రి చెప్పారు. నివాసయోగ్యం కాని భూములను, స్మశానాలు, డంపింగ్ యార్డులు పక్కనున్న భూములను, వర్షం వస్తే మునిగిపోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక ధరలకు ప్రభుత్వంతో కొనిపించారని దుయ్యబట్టారు. మొత్తం 10,500 కోట్ల రూపాయలతో 26 వేల ఎకరాల ప్రైవేట్ భూములను కొనుగోలు చేశారని.. ఇందులో నుండి వేల కోట్ల రూపాయలు వైసీపీ నేతలు, కార్యకర్తల జేబుల్లోకి వెళ్లాయని అన్నారు. కానీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే అందరికీ ఇళ్ల పథకాన్ని చేపట్టిందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పష్టం చేశారు.

# బనకచర్ల ప్రాజెక్ట్‌పై నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి

## ఆర్‌పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్




రాజమహేంద్రవరం మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
తమిళనాడు – కర్ణాటక రాష్ట్రాల్లో రాజకీయ ప్రయోజనాల కోసమేనా మోడీ సర్కార్ బనకచర్ల ప్రాజెక్ట్ ఆలోచన తెర మీదకు తెస్తున్నారా ! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేసారు. నిపుణుల అభిప్రాయ సేకరణ లేకుండానే బనకచర్ల ప్రాజెక్ట్‌కు చంద్రబాబు కూటమి మొగ్గు చూపటం పోలవరం ప్రాజెక్ట్‌కు తూట్లు పొడవటం వంటిదన్నారు. గతంలో గోదావరి – పెన్నా నదుల అనుసంధానంతో ఎన్నో ప్రయోజనాలు వున్నాయన్న చంద్రబాబు నేడు గోదావరి – బనకచర్ల అనుసంధానం తెరమీదకు తేవటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆదివారం ఆర్‌పిసి కార్యాలయంలో జరిగిన వారంతపు సమావేశంలో మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రజల జీవనాదారానికి సంబందించిన నీటి వనరుల సమస్యపై చంద్రబాబు పునరాలోచన చేయాలి అన్నారు. నీటి వనరులకు సంబందించిన అంశాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిపుణుల అభిప్రాయానికి శాస్త్రీయ పరమైన కమిటీని నియమించి గోదావరి – బనకచర్ల నదుల అనుసంధానంపై భవిష్యత్ తరాలకు జరిగే నష్టంపై స్పష్టమైన నివేదికను తెలియచేయాలని, చంద్రబాబు మొగ్గు చూపుతున్న బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ నీటి అవసరాలకు అనేక ఇబ్బందులు తలెత్తె ప్రమాదాలు కనపడుతున్నాయని ఆయన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. దూరదృష్టి లేని పాలకుల ఆలోచనలు బావితరాల ఉజ్వల భవిష్యత్‌కు అత్యంత ప్రమాద పరిస్థితులకు కారణం కావొచ్చునని హెచ్చరించారు. భవిష్యత్ ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై చంద్రబాబు పునరాలోచన చేయాలన్నారు. ఒరిజినల్ డిపిఆర్ మేరకు పోలవరం ప్రాజెక్ట్‌ను యుద్ధప్రాతిప్రదికన పూర్తి చేయాలని, ప్రత్యేక హోదా , విభజన హామీలపై మోడీ సర్కార్ పై చంద్రబాబు కూటమి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దృష్ట్యా ఒత్తిడి పెంచాలని కోరారు. ఆర్పీసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అర్పిసి సెక్యూలర్స్ డివి రమణ మూర్తి, సిమ్మా దుర్గారావు, దుద్దే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, ఆకుల మణికాంత్, మోర్తా ప్రభాకర్, వాడపల్లి జ్యోతిష్, దుద్దే త్రినాద్, దొంగ బాలాజీ, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బత్తెన శివన్నారాయణ, వల్లి శ్రీనివాసరావు, పిట్టా శ్రీనివాసరావు, చల్లా సాంబశివరావు, చిట్టూరి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 3లక్షల కోట్ల పైబడి రాష్ట్ర బడ్జెట్

**సంక్షేమం.. అభివృద్ధికి పెద్దపీట**

**పోసాని మూర?శిఖామణి.. వాడిని ఉరి తీయాలి**

**పుష్కరాల నాటికి కార్పొరేషన్‌కు పాలకవర్గం**

**రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

రాజమహేంద్రవరం మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక శ్యామలానగర్‌లోని తన నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏపీ బడ్జెట్(2025-26) తొలిసారిగా రూ.3 లక్షల మార్కు దాటిందని, ఆ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసిందన్నారు. జగన్ ప్రబుత్వం చేసిన అప్పులను తమ ప్రభుత్వం తీరుస్తుందన్నారు. రూ.43 వేల కోట్ల అప్పులను తమ ప్రభుత్వమే చెల్లించినట్లు వెల్లడిరచారు. వైసీపీ హయాంలో ఏపీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, కోట్ల రూపాయలు ఖర్చు చేసి 20 వేల కిలోమీటర్ల రహదారులను బాగు చేసినట్లు తెలిపారు. ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతి రంగానికీ తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు సహా ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమానికీ గత ప్రభుత్వం కంటే అధికంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉందని, ఈ మేరకే రూ.6 లక్షల కోట్ల పెట్టుబడితో ఎంవోయులు కుదుర్చుకున్నట్లు చెప్పుకొచ్చారు. సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీ అరెస్టుపై ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి స్పందించారు. పోసాని ఓ మూర? శిఖామణి అంటూ కామెంట్ చేశారు. ఎదుటివారి కుటుంబసభ్యులు, ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోసాని లాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని, మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వారిని ఉరి వేయాలని గోరంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని, కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాలకమండలి ఎన్నికలకు కోర్టు కేసులు అడ్డంగా ఉన్నాయన్నారు. కేసులను పరిష్కరించి జూల్కై నాటికి ఎన్నికలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. రానున్న గోదావర పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు నూతన పాలవకర్గం కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాలకు ఎన్నికలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటిపడిరదని, గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం అయితే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపిపి వెలుగుబంటి సత్య ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ం



# సత్యదేవ నర్సరీని సందర్శించిన ఆచంట ఎమ్మెల్యే పితాని

కడియం, మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కడియం మండలం కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీ (పుల్లా.చంటియ్య) నర్సరీని పశ్చిమగోదావరి జిల్లా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సందర్శించారు.ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నర్సరీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నారన్నారు.ఆయనకి సత్యదేవ నర్సరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా పెద్ద సత్యనారాయణ వివిధ రకాల పండ్ల మరియు పువ్వుల మొక్కలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో నర్సరీ రైతులు మెర్ల కృష్ణ, చెక్కపల్లి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

# మీ అవినీతి బురద ఎమ్మెల్యే వాసుకి అంటించొద్దు

## గౌతమీ సూపర్ బజారు లీజులో రూ.5 కోట్లు అవినీతి చేసింది భరతే

## టిడిపి నాయకులు కాశి నవీన్, బుడ్డిగ రాధ

రాజమహేంద్రవరం మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పేపరు మిల్లు పరంపర కార్మికులు 111 మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారినుంచి లక్షలాది రూపాయలు దండుకుని ప్రవీణ్ చౌదరితో కలిసిపంచుకు తిన్న మాజీ ఎంపీ, పారాచ్యూట్ లీడర్ మార్గాని భరత్‌కు తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మండిపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నవీన్ మాట్లాడుతూ పరంపర-1,2లో 111 మంది కార్మికులకు ఉద్యోగాలు వేయించి వారి నుంచి అక్రమంగా లక్షలు దండుకున్న భరత్ దమ్ము, ధైర్యం ఉంటే మిల్లు గేటు దగ్గరకు వచ్చి ఆ కార్మికులకు న్యాయం చేస్తానని చెప్పగలడా అని సవాల్ చేశారు. తమ వద్ద నుంచి లక్షలాది రూపాయలు ముడుపులు పుచ్చుకుని ప్రవీణ్ చౌదరి మాజీ ఎంపీ భరత్, మిల్లు ఉన్నతాధికారులు పంచుకున్నారని ఇటీవల పరంపర కార్మికులు మీడియాతో చెప్పిన సంగతిని గుర్తు చేశారు. దీనిని పారాచ్యూట్ లీడర్ భరత్ ఎందుకు ఖండిరచలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా నిత్యం ప్రజల్లో తిరుగుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తారని, కాని భరత్ ఓడిపోయిన తర్వాత హైదరాబాద్ వెళ్ళిపోయి వారం పదిరోజులకు ఒకసారి రాజకీయంగా ఉన్నానని చెప్పుకోడానికి పారాచ్యూట్ లీడర్ లా వచ్చి ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదివి మళ్ళీ వెళ్ళిపోతాడని మండిపడ్డారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టి ప్రచారం చేయలేకపోయావు అని ప్రశ్నించారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా మాట్లాడుతూ రాజమండ్రిలోని గౌతమీ సూపర్ బజారు స్థలం లీజులో పారాచ్యూట్ లీడర్ మార్గాని భరత్ రూ.5 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు మా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. పారాచ్యూట్ లీడర్ భరత్ పిచ్చి పరాకాష్టకు చేరుకుందని, అందుకే ఎంతపుచ్చుకున్నావని మా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆక్షేపించారు. నిబంధనలకు విరుద్ధంగా 33 ఏళ్ళకు సబ్ లీజుకు ఇచ్చాడని, దీనిపై తమ ఎమ్మెల్యే శ్రీనివాస్ సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు కూడాచేశారని గుర్తు చేశారు. అయితే లీజుకు తీసుకున్నప్పటికి నిర్మాణాలు చేపట్టనివ్వడం లేదని లీజు దారులు కోర్టుకు వెళ్లారన్నారు. ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని సహకార శాఖ కార్యదర్శి రాజశేఖర్ దృష్టికి, టౌన్ ప్లానింగ్‌కు చెప్పి నిర్మాణాలు ఆపించారన్నారు. నోటీసు కూడా ఇచ్చారని తెలిపారు. వైసీపీ అధికారంపోగానే నవరత్నాలు పోయాయని, ఇప్పుడు తొమ్మిది మంది జాతి రత్నాలు ఉన్నారని బుడ్డిగ రాధా ఎద్దేవా చేశారు. జగన్, పారాచ్యూట్ లీడర్ మార్గాని భరత్, బోరుగడ్డ అనిల్, వల్లభనేని వంశీ, పోశాని కృష్ణ మురళీ, జోగి రమేష్, కోడాలి నాని, పేర్ని నాని, రోజా జాతి రత్నాలు అని ఎద్దేవా చేశారు. వారి నాయకుడు జగన్ అధికారం పోయిన వెంటనే 11 సీట్లు ఉన్న విమానం కొని బెంగుళూరు వెళ్ళిపోయాడని, ఎక్కడ శవాలు ఉంటే అక్కడ ఆ విమానంలో వాలిపోతాడని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు చాపల చిన్న రాజు, దుత్తరపు గంగధర్, బొర్రా చిన్ని, మామిడి శ్రీను, కానేటి ప్రభుదాస్, ఆడారి లక్ష్మి నారాయణ, బత్తుల కిరణ్ బాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్‌లో దళిత వర్గాలకు ప్రాధాన్యత

## సిఎం చంద్రబాబు నాయుడుకు ఎస్సీలు పాలాభిషేకం

రాజమహేంద్రవరం మార్చి 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
రాష్ట్ర బడ్జెట్ లో రూ.20,250 కోట్లు కేటాయించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దళితవర్గాలకు ప్రాధాన్యత కల్పించారని రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గానికి చెందిన దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ లో ఎస్సీలకు ప్రాధాన్యత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గం క్లస్టర్ ఇన్చార్జి తలారి మూర్తి ఆధ్వర్యంలో స్థానిక శ్యామలానగర్‌లోని రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇంటివద్ద ముఖ్యమంత్రి చంద్రబావు నాయుడు చిత్రపటానికి దళిత నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా గోరంట్ల పాల్గొని మాట్లాడుతూ గత జగన్ మోహన్ రెడ్డి పాలనలో దళితులను నాశనం చేశారని ఆరోపించారు. ఎస్సీలకు అమలయ్యే పథకాలను తొలగించి వారి అభివృద్ధిని కుంటి పరిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి బడ్జెట్‌లో రూ.20,000 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించిందన్నారు. దళితులకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుంది అన్నారు. తలారి మూర్తి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీలకు అందే 27 సంక్షేమ పథకాలను నిలిపేసిందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దళిత రాజ్యం స్థాపన దిశగా బడ్జెట్‌లో రూ.20 వేలకోట్లు పైబడి నిధులు కేటాయించిందన్నారు. కృతజ్ఞతగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గోరంట్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రూరల్, కడియం మండల ఎస్సీ నాయకులు జల్లి కృపావరం, రొంపిచర్ల ఆంథోనీదాస్, కాయల సత్యనారాయణ, పెనుమచ్చి సురేష్, ముచ్చి నాని, కె సూర్య కుమార్, ఈతకోట రాజ్ కుమార్, నాగరాజు, కొడమంచిలి సూర్య, జీడి చంటి, బెంజిమెన్, చాపల వెంకట్రావు, శీలం రవి తదితరులు పాల్గొన్నారు.



# ఆసీస్‌ను ఈసారి వదలొద్దు..!



**ఆసీస్ : 'నిను వీడని నీడను నేను..' ఇదేదో పాత సినిమాలో సాంగ్ కదా.. ఇది సరిగ్గా ఆస్ట్రేలియా జట్టుకు నప్పుతుంది. ప్రతి టోర్నీలోనూ టీమ్‌ఇండియాను వదిలిపెట్టకుండా వెన్నంటే వస్తూ సై అంటూ సవాల్ విసిరేందుకు సిద్ధమవుతుంది. గత వన్డే ప్రపంచ కప్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌తోపాటు పొట్టి కప్ సూపర్ 8 పోరులో ఇరుజట్లూ తలపడ్డాయి. తాజాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్‌లోనూ భారత్‌ను ఢీకొట్టేందుకు ఆసీస్ దూసుకొచ్చింది. మరి ఇరుజట్ల బలాలు, క్రికెటర్ల ఫామ్‌పై ఓ లుక్కేద్దాం.**

హ్యాట్రిక్ విజయాలు సాధించిన టీమ్‌ఇండియా జోష్ మీదుంది. తాజాగా ఓ మోస్తరు లక్ష్యం నిర్దేశించి మరీ కివీస్‌ను చిత్తు చేసిన భారత్ కీలకమైన సెమీస్‌కు సిద్ధమవుతోంది. దుబాయ్ వేదికగానే ఈ మ్యాచ్ ఉండటంతో టీమ్‌ఇండియానే ఫేవరెట్ అని అనడంలో సందేహం లేదు. కానీ, మెగా టోర్నీల్లో ఆస్ట్రేలియాను తక్కువగా అంచనా వేయకూడదు. అందుకు ఉదాహరణ గత వన్డే ప్రపంచ కప్. ఆరంభంలో తడబాటుకు గురైనా.. ఫైనల్‌కు చేరుకొని భారత్‌కే షాక్ ఇచ్చి కప్‌ను ఎగరేసుకుపోయింది. ఇప్పుడు కూడా అంతే. తొలుత ఈ స్క్వాడ్‌ను చూసిన క్రీడా పండితులు కనీసం గ్రూప్ స్టేజ్‌ను కూడా దాటడం కష్టమేనని అభిప్రాయపడ్డారు. దానికి కారణం.. ఇతర జట్లలో మాదిరిగా స్టార్ పేసర్లు ఆసీస్‌కు లేరు. దాదాపు అంతా కొత్తవారే. ఒకే ఒక్క స్పెషలిస్ట్ స్పిన్నర్ ఆడమ్ జంపాతోనే ఆ జట్టు బరిలోకి దిగుతోంది. గ్రూప్ స్టేజ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు 350o పరుగులు రాబట్టారంటే ఆసీస్ బౌలింగ్ ఎలాఉందో అర్థం చేసుకోవచ్చు. అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. అఫ్గాన్ కూడా 270o పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ వంటి పేసర్లు లేకపోవడంతో ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ బలహీనంగా మారింది. వీరంతా గాయాలకారణంగా టోర్నీకి ముందే దూరమైన సంగతి తెలిసిందే. స్పెన్సర్ జాన్స్, నాథన్ ఎల్లిస్, డ్వారిషుఉస్.. ఉన్నప్పటికీ అంతర్జాతీయస్థాయిలో వారికి అనుభవం తక్కువ. భారత్‌తో పోలిస్తే ఆసీస్ పేస్ విభాగం బలహీనమైందే.

### భారత్ అన్ని విభాగాల్లో..

టీమ్‌ఇండియా అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లోనే ఆడేస్తోంది. తొలి రెండింట్లో భారత్ మొదట బౌలింగ్ చేసింది. లక్ష్య ఛేదనలో మన బ్యాటర్లు అదరగొట్టారు. టాప్ ఆర్డర్ రాణించడంతో అలవోకగా విజయం సాధించారు. ఇక గ్రూప్ స్టేజ్‌లో అగ్రస్థానం తేల్చిన కివీస్‌తో పోరులో మాత్రం టాప్ 3 బ్యాటర్లు త్వరగా పెవిలియన్‌కు చేరారు. దీంతో మిడిలార్డర్‌కు కఠిన పరీక్ష ఎదురైంది. ఇందులో భారత్ డిస్టింక్షన్‌లో పాసైంది. బౌలర్లకు సహకారం లభించిన దుబాయ్ పిచ్‌పై 250 పరుగుల టార్గెట్‌ను ఉంచడమంటే సాధారణ విషయం కాదు. ఇక మిగతా బాధ్యతను మాకు వదిలేయండంటూ భారత బౌలర్లు ముందుకొచ్చారు. ఆ లక్ష్యాన్ని కాపాడి అద్భుత విజయాన్ని అందించారు. ఇందులో కీలకపాత్ర నలుగురితో కూడిన స్పిన్ విభాగానిదే. స్క్వాడ్‌లో ఐదుగురిని తీసుకుని.. కివీస్‌తో మ్యాచ్‌లో నలుగురిని బరిలోకి దింపి సానుకూల ఫలితం రాబట్టిన భారత మేనేజ్‌మెంట్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

# అవి చౌకబారు వ్యాఖ్యలు

## రోహిత్‌పై బాడీషేమింగ్‌పై బీసీసీఐ..!



**ఇంగ్లాండ్ : : భారత క్రికెట్ హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లావుగా ఉన్నాడంటూ కాంగ్రెస్ నేత శమా మహమ్మద్ చేసిన సోషల్ మీడియా పోస్టు విమర్శలకు దారి తీసింది. తాజాగా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ పెద్దలు కూడా స్పందించారు. కీలక టోర్నీ మధ్యలో ఉన్నప్పుడు ఇటువంటి కామెంట్లు చేసి ఉండాల్సింది కాదన్నారు. తాజాగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. వ్యక్తిగత ప్రచారం కోసమే ఇలాంటివి చేయడం మానుకోవాలన్నారు.**

"జట్టు ఓ కీలకమైన ఐసీసీ టోర్నీ మధ్యలో ఉంది. ఆ సమయంలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి నుంచి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు రావడం దురదృష్టకరం. అవి వ్యక్తిగతంగా ఆటగాడిపైనా లేదా.. జట్టుపై ప్రతికూల ప్రభావం చూపించి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యక్తిగత ప్రచారం కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి" అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద సైకియా అన్నారు.

శమా మహమ్మద్ ఎక్స్‌లో పోస్టు ఓ పోస్టు చేశారు. దీనిలో "రోహిత్ శర్మ లావుగా ఉన్నాడు. అతడు బరువు తగ్గాల్సిన అవసరం ఉంది." అని ఆ పోస్టులో వ్యాఖ్యానించారు. ఇది వెంటనే వైరల్‌గా మారింది. మరోవైపు ఇంత జరిగినా.. శమా మహమ్మద్ మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకొనే యత్నం చేశారు. ఉదయం ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ "క్రీడాకారుడి ఫిట్‌నెస్ గురించి చెబుతూ చేసిన సాధారణ ట్వీట్ అది. అది బాడీ షేమింగ్ కాదు. ఆటగాళ్లు ఫిట్‌గా ఉండాలని నేను నమ్ముతాను. అతడు కొంచెం ఓవర్ వెయిట్ ఉన్నాడని భావించాను. దాని గురించే పోస్టు చేశాను. నాపై ఆకారణంగా విమర్శల దాడులు చేస్తున్నారు. నేను అతడిని గత కెప్టెన్లతో పోలుస్తూ రాసుకొచ్చాను. నాకు ఆ హక్కు ఉంది. చెప్పడంలో తప్పేముంది. ఇది ప్రజాస్వామ్యం" అని సమర్థించుకొన్నారు. ఈ పోస్టు కాంగ్రెస్-భాజపా మధ్య రాజకీయ విమర్శలకు దారితీసింది. దీంతో హస్తం పార్టీ శమా వ్యాఖ్యలకు దూరంగా జరిగింది. తమకు వాటితో సంబంధం లేదని పేర్కొంది. ఆ పోస్టును తొలగించమని ఆదేశించింది.

### టీఎంసీ ఎంపీ తీవ్ర వ్యాఖ్యలు

ఓ పక్క కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి శమా మహమ్మద్ పోస్టుతో మొదలైన వివాదానికి టీఎంసీ ఎంపీ సౌగత రాయ్ మరింత ఆజ్యం పోశారు. అసలు రోహిత్ జట్టులోనే ఉండకూడదన్నాడు. "కాంగ్రెస్ నేత నిజమే చెప్పింది. రోహిత్ కనీసం జట్టులో కూడా ఉండకూడదు" అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# పాక్‌లో ఆడుంటే.. భారత్ భారీ స్కోర్లే చేసేది

## 'దుబాయ్' పిచ్ అడ్వాంటేజ్‌పై గంగూలీ



**ఇంగ్లాండ్ : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ లో భారత్ సెమీస్‌కు చేరుకుంది. దుబాయ్ వేదికగానే టీమ్‌ఇండియా అన్ని మ్యాచ్‌లనూ ఆడుతోంది. ఇదే కొందరికి నచ్చలేదు. అవాకులు, చెవాకులు పేలుతూ భారత విజయాలను తక్కువ చేసే పనిలో పడ్డారు. అలాంటి వారిలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైక్ అథర్టన్ ముందున్నారు. వారికి భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. "పాకిస్థాన్ పిచ్‌లు కాస్త నయం. ఒకవేళ భారత్ కనుక దుబాయ్‌లో కాకుండా పాక్‌లో ఆడుంటే భారీ స్కోర్లను చేసేది. కొందరు చేస్తున్న వ్యాఖ్యలన్నీ చెత్తవే. అలా ఎందుకు మాట్లాడతారో అర్థం కాదు" అని వ్యాఖ్యానించాడు.**

### భారత్ ఎవరినైనా ఓడించగలదు

"టీమ్‌ఇండియా గత టీ20 ప్రపంచకప్‌ను నెగ్గింది. అలాగే వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత్ బలమైన జట్టే. ప్రత్యర్థి ఎవరైనా సరే.. ఆ జట్టును ఓడించగల సత్తా టీమ్‌ఇండియా సొంతం. బౌలింగ్ పరంగా జస్‌ప్రీత్ బుమ్రా లేనప్పటికీ షమీ రూపంలో నాణ్యమైన పేసర్ ఉన్నాడు. అయితే, గాయాలు క్రికెట్‌లో సహజమే. మరీ ముఖ్యంగా పేసర్లకు గాయాల బెడద ఎక్కువే. బుమ్రాతో కలిసి షమీ చాలా మ్యాచ్‌లు గెలిపించాడు" అని గంగూలీ తెలిపాడు.

### మేం అలా చేయలేకపోయాం: హెన్రీ

దుబాయ్ పిచ్ భారత్‌కు అడ్వాంటేజ్ అనే వార్తలపై న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ స్పందించాడు. "ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుందని మాకు ముందే తెలుసు. వారంతా అద్భుతంగా బౌలింగ్ చేశారు. పరిస్థితిని అర్థం చేసుకోవడంలో వారు సక్సెస్ అయ్యారు. మేం అలా చేయలేకపోయాం. మరీ ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి నాణ్యమైన స్పిన్ బౌలింగ్ వేశాడు. రెండువైపులా బంతిని టర్న్ చేశాడు. భారత్‌కు పిచ్‌పై పూర్తి అవగాహన ఉంది. మెరుగైన బౌలింగ్ ఎటాక్‌ను సిద్ధం చేసుకోవడం భారత్‌కు సాయపడింది" అని హెన్రీ తెలిపాడు.

# సెమీస్ నుంచే అసలు టోర్నీ మొదలు: జంపా



**ఆసీస్ : సెమీఫైనల్స్ నుంచే అసలైన ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ మొదలవుతుందని ఆసీస్ స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా పేర్కొన్నాడు. అతడు దుబాయ్‌లోని ఓ ఆస్ట్రేలియా పత్రికతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. స్థానిక ఐసీసీ అకాడమీలో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని మెచ్చుకొన్నాడు. "పాక్‌లో వరుసగా వేర్వేరు సిటీల్లో మ్యాచ్‌లతో బిజీగా గడిపాము. కానీ టోర్నమెంట్ స్వభావం ప్రకారం ఎక్కడ తొలి సెమీస్ జరుగుతుందో చివరివరకు తెలియలేదు. ఇక్కడికి (దుబాయ్) రావడం బాగుంది. మంచి సౌకర్యాలు లభించాయి.**

ఈ టోర్నీలో ఎక్కువ ఆడే అవకాశం రాకపోయినా.. ప్రిపరేషన్ బాగానే జరిగింది. ప్రతి మ్యాచ్ కీలకమైందే. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారీ స్కోర్ ఛేజ్ చేయడంతో మిగిలిన టోర్నీకి మమ్మల్ని సిద్ధం చేసింది. ఇక అఫ్గానిస్థాన్‌పై బౌలింగ్ కూడా బాగుంది. కానీ, అసలైన టోర్నమెంట్ సెమీఫైనల్స్ నుంచే మొదలవుతుంది. ప్రతీ మ్యాచ్ గెలిచి తీరాల్సిందే" అని జంపా వెల్లడించాడు.

### కోహ్లీతో పోరుపై ఉత్కంఠ..

భారత్-ఆసీస్ మ్యాచ్ అంటే గుర్తుకొచ్చే వాటిల్లో కోహ్లీ-జంపా మధ్య జరిగే పోరాటం ఒకటి. వీరిద్దరూ ఆధిపత్యం కోసం తీవ్రస్థాయిలో తలపడటం ఖాయం. స్పిన్నర్లకు అనుకూలించే దుబాయ్ వికెట్‌పై జంపా దూకుడు ఎలా ఉంటుందోనని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. 2017 నుంచి జంపా వేసిన 245 బంతులను కోహ్లీ ఎదుర్కొన్నాడు. వీటిల్లో 73 డాట్‌బాల్స్, 264 పరుగులు సాధించడంతోపాటు.. ఐదుసార్లు వికెట్‌ను సమర్పించుకొన్నాడు. స్ట్రైక్‌రేట్ 107 కాగా.. సగటు 52గా ఉంది. కోహ్లీ మొదట్లో ఇబ్బందిపడినా.. 2023 వచ్చేనాటికి కుదురుకొన్నాడు. ఆ సంవత్సరం జంపా విసిరిన 52 బంతులను ఎదుర్కొని.. 50 పరుగులు సాధించాడు. వికెట్ మాత్రం కోల్పోలేదు.

ఈసారి ఆసీస్ బౌలింగ్ దళాన్ని జంపానే ముందుకు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి పేసర్లు జట్టుకు దూరమయ్యారు. దీంతో జాన్స్, ఎల్లిస్, డార్విషుఉస్ వంటి జూనియర్లతో బరిలోకి దిగుతోంది. భారత్‌తో పోలిస్తే ఆసీస్ పేస్ విభాగం బలహీనంగా ఉంది.

# కివీస్‌తో మ్యాచ్..

## 300వ వన్డే హీరోకే 'బెస్ట్ ఫీల్డర్' మెడల్



**న్యూజిలాండ్ : ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ స్టేజ్ ముగిసింది. చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. ప్రతి మ్యాచ్ అనంతరం 'బెస్ట్ ఫీల్డర్' మెడల్‌ను అందజేయడం గత వన్డే ప్రపంచ కప్ నుంచి ఆనవాయితీగా వస్తోంది. దానిని ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ బీసీసీఐ మేనేజ్‌మెంట్ కొనసాగిస్తోంది. తాజాగా కివీస్‌తో మ్యాచ్ అనంతరమూ 'బెస్ట్ ఫీల్డర్' అవార్డును అందజేయడం గమనార్హం. ఈసారి రేసులో ముగ్గురు ఉండగా.. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీని మెడల్ వరించింది.**

36 ఏళ్ల విరాట్ కోహ్లీకిది 300 వన్డే మ్యాచ్. బ్యాటింగ్‌లో 11 పరుగులే చేసినా.. ఫీల్డింగ్‌లో మాత్రం చురుగ్గా ఉన్నాడు. దీంతో శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్‌ను కాదని బెస్ట్ ఫీల్డర్ మెడల్ విరాట్‌కు దక్కింది. అక్షర్ పటేల్ అద్భుతమైన క్యాచ్‌ను అందుకున్నాడు. విరాట్ కూడా ఇన్నింగ్స్ ఆఖర్లో మంచి క్యాచ్‌ను పట్టాడు. కానీ, మైదానంలో మెరుపులా కదులుతూ పరుగులను నియంత్రించడంతో ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఈ మెడల్‌కు కోహ్లీ పేరును ప్రకటించాడు. ఈసందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లోనే త్రోడౌన్ స్పెషలిస్ట్ నువాన్ చేతులమీదుగా విరాట్ 'బెస్ట్ ఫీల్డింగ్ మెడల్'ను స్వీకరించాడు.

# నాని ప్యారడైజ్ గ్లింప్స్ విడుదల




దసరా సినిమాతో తన మాస్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన నానికి, ఈ సినిమా మరో లెవల్ హిట్‌ను అందించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దసరాని తెరకెక్కించిన శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాకు కూడా దర్శకత్వం వహిస్తున్నాడు. దీంతో ఈ కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి అదనంగా తాజాగా 'రా స్టేట్‌మెంట్ గ్లింప్స్' అనే వీడియోను విడుదల చేశారు. ఇందులో నాని పాత్రను పరిచయం చేసే విధానం మాస్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకునేలా ఉంది.

**రా స్టేట్‌మెంట్ గ్లింప్స్ %-% సినిమాకు అద్భుతమైన హైప్!**

సినిమాకు సంబంధించిన గ్లింప్స్ చూస్తే, కథానుసారం ఇది పక్కా మాస్ సినిమా అని స్పష్టంగా అర్థమవుతోంది. 'మదర్స్ రా స్టేట్‌మెంట్స్', 'సన్ రెవల్యూషన్' పేరుతో విడుదలైన ఈ గ్లింప్స్ లో పవర్‌ఫుల్ డైలాగ్స్, ఇంటెన్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచేశాయి.

**గ్లింప్స్‌లో వినిపించే డైలాగ్:**

"చరిత్రలో అందరూ చిలకలు, పావురాల గురించి రాశారు కానీ అదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలేదు. ఇది కడుపు మండిన కాకుల కథ జమనా జమనాల కెళ్లి నడిచే శవాల కథ అమ్మ రొమ్ములో పాలు లేక రక్తం పోసి పెంచిన ఓ జాతి కథ ఓ థగడ్ వచ్చి మొత్తం జాతిలో ఓ జోష్ తెచ్చిండు కాకులు తల్వార్‌లు పట్టినయ్ ఇది ఆ కాకులను ఒక్కటి చేసిన ఓ లం.. కొడుకు కథ నా కొడుకు నాయకుడైన కథ నీయమ్మ" ఈ డైలాగ్ వినగానే సినిమాకు సంబంధించి చాలా హైప్ క్రియేట్ అయింది. కథ, పాత్రల నేపథ్యంలో చాలా ఇంటెన్స్ ఎమోషన్లు ఉండబోతున్నాయనేది గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది.

**డైరెక్షన్, టెక్నికల్ టీమ్, బడ్జెట్**

దసరాతో డెబ్యూ చేసిన శ్రీకాంత్ ఓదెల, మాస్ సినిమా తెరకెక్కించడంలో తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. ఈ సినిమా మరింత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, నాని కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ సినిమా ఇదేనని చెబుతున్నారు. సినిమాటోగ్రఫీ: మాస్ సినిమాలకు అవసరమైన రా లుక్స్, ముదురు షేడ్‌లను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: మ్యూజిక్ ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. మాస్ ప్రేక్షకుల రక్తాన్ని మరింత ఉరకలెత్తించేలా సంగీతం ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి. యాక్షన్ సీక్వెన్స్‌లు: ట్రైలర్ వదిలేలోపు కేవలం గ్లింప్స్ చూసినా, సినిమా యాక్షన్ పార్ట్ మీద ఆసక్తి పెరిగిపోయింది. ప్యారడైజ్ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. 2026 మార్చి 26న ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ప్యారడైజ్ నానికి మాస్ హీరోగా మరింత పేరు తెచ్చే సినిమా కానుందనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో ఉంది. గ్లింప్స్‌లోని డైలాగ్స్, విజువల్స్, నాని లుక్ %-% అన్నీ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. దసరా తరువాత నానికి మరో భారీ హిట్ ఇస్తుందా? అన్న ప్రశ్నకు సమాధానం తెలియాలంటే సినిమాకు ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే!

# 'ఛావా' తెలుగు ట్రైలర్..

# గూస్‌బంప్స్ పక్కా!

చత్రపతి శంభాజీ మహారాజ్ వీరత్వాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించిన ఛావా సినిమా హిందీలో ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. విక్కీ కౌశల్ శంభాజీ పాత్రలో నటించిన ఈ చిత్రం, విడుదలైనప్పటి నుండి సెన్సేషన్ క్రియేట్ చేసింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి హిందీలో అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పటికే బాక్సాఫీస్ లెక్క రూ.500 కోట్లను దాటడం విశేషం. దేశవ్యాప్తంగా అద్భుతమైన క్రేజ్ రావడంతో పాటు రీజినల్ లాంగ్వేజ్ లలో కూడా సినిమాను విడుదల చేయాలని సినిమాపై యూనిట్ పై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కూడా శివాజీ మహరాజ్ కు అభిమానులు ఉన్నారు. ఇక ఆయన వారసుడి జీవితాన్ని వెండితెరపై చూడాలని బలంగా కోరుకున్నారు. ఇక వారి కోరిక మేరకు ఇప్పుడు ప్రముఖ గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా చావా సినిమాను తెలుగులో విడుదల చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా, ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. తెలుగు ట్రైలర్ చూస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోతాయి. ముఖ్యంగా చత్రపతి శంభాజీ మహారాజ్ జీవితకథ, ఆయన వీరోచిత పోరాటాలు తెలుగు ప్రేక్షకులను సైతం ఎంతగానో ఆకట్టుకునేలా ఉన్నాయి. విక్కీ కౌశల్ శంభాజీ మహారాజ్‌గా నటించిన తీరును చూస్తుంటే నిజంగానే అప్పుడు మన ముందున్న మహారాజ్ కనిపిస్తున్నట్లు అనిపిస్తుంది. ఇక రష్మిక మందన్నా శంభాజీ సతీమణి యేసుభాయి పాత్రలో కనిపించి మరోమారు తన మినరల్ పెర్ఫార్మెన్స్‌ను చూపించారు. ఇక 'ఔరంగజేబ్' పాత్రలో అక్షయ్ ఖన్నా కనిపించిన విధానం ఈ సినిమాలో మరో హైలెట్. ఈ ట్రైలర్‌లో చూపించిన యుద్ధ దృశ్యాలు, రాజకీయ మర్మాలు, కుటుంబ బంధాలు, వీరత్వం..వంటి అంశాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. శంభాజీ కథను తెలుగులో చూడాలి అని ఎదురుచూస్తున్న జనాలకు ఇప్పుడు ఈ ట్రైలర్ మరింత హైప్ క్రియేట్ చేసింది. ఇక సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. సాంగ్స్ ను కూడా తెలుగులో అద్భుతంగా ప్రజెంట్ చేసినట్లు అనిపిస్తోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లో ఏఆర్ రెహ్మాన్ మ్యూజిక్ ఈ విజువల్స్‌ను ఇంకాస్త ఎలివేట్ చేసింది. ముఖ్యంగా కొన్ని డైలాగులు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. తెలుగు డబ్బింగ్ కూడా అద్భుతంగా పేలింది. సాధారణంగా ఇలాంటి పీరియాడిక్ మూవీస్‌కి డబ్బింగ్ సహజంగా ఉండకపోతే, ప్రేక్షకులు అంతగా కనెక్ట్ కాకపోవచ్చు. కానీ 'ఛావా'కి మాత్రం సరిగ్గా కుదిరిన డైలాగ్ డెలివరీ, ప్రాస యధాతథంగా ఉండటంతో సినిమా నేటివిటీ కోల్పోకుండా, సహజత్వాన్ని నింపింది. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి చారిత్రాత్మక కథలను ఎంతో ఇష్టపడతారు. 'ఛావా' కూడా అదే తరహాలో అద్భుతమైన విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. చత్రపతి శంభాజీ మహారాజ్ గురించి తెలియని వారికీ, ఆయన పోరాట వైభవాన్ని గురించి వివరించే ఒక అద్భుతమైన కాంటెంట్ మూవీ ఇది. ఈ చిత్రాన్ని మార్చి 7న తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.




# తమన్నా.. పాలరాతి శిల్పమే..





బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి తనదైన గుర్తింపు... మంచి ఫేమ్ సంపాదించుకుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. హీరోయిన్ తమన్నా భాటియాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి తనదైన గుర్తింపు... మంచి ఫేమ్ సంపాదించుకుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. పరిశ్రమలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా అదే క్రేజ్.. అదే గ్లామర్.. ఆమె సొంతమనే చెప్పాలి. మరాఠీ బ్యూటీ అయిన తమన్నా.. నార్త్ టు సౌత్ అందరినీ అలరిస్తూ దూసుకుపోతోంది. కెరీర్ స్టార్టింగ్ లోనే టాలీవుడ్ ను ఓ రేంజ్ లో ఏలిందని చెప్పొచ్చు. స్టార్ హీరోలందరితో ఆడిపాడి తక్కువ టైమ్ లోనే ఎక్కువ గుర్తింపు సొంతం చేసుకుంది తమన్నా. ఇప్పుడు హీరోయిన్ గా నటిస్తూనే.. స్పెషల్ సాంగ్స్ తో అలరిస్తోంది. రీసెంట్ గా రజినీ కాంత్ జైలర్ లో కావాలయ్యా పాటతో ఓ ఊపు ఊపేసింది తమన్నా. ఆమె డ్యాన్స్ అండ్ ఎక్స్ప్రెషన్స్ కు అంతా ఫిదా అయిపోయారు. ఆ తర్వాత బాలీవుడ్ మూవీ స్త్రీ 2లోని ఆజ్ కీ రాత్ సాంగ్ తో మరోసారి మెప్పించింది. తన అందచందాలు, స్టెప్పులతో ఓ రేంజ్ లో అందరినీ అలరించింది అమ్మడు. అయితే కెరీర్ పరంగా బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తమన్నా చేసే సందడి వేరే లెవెల్. ఎప్పటికప్పుడు గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంటోంది. తాజాగా మరో బ్యూటిఫుల్ పిక్స్ తో తళుక్కుమంది అమ్మడు. వైట్ కలర్ మిడ్డీ డ్రస్ లో తమన్నా అదరగొట్టేసిందనే చెప్పాలి. క్లాసీ లుక్ లో తన గ్లామరస్ స్కిన్ తో మైండ్ బ్లాక్ చేసేసింది. బ్లాక్ కలర్ ఫ్లోరల్ ప్రింట్ తో ఉన్న వైట్ డ్రెస్ అదిరిపోగా.. గ్లాసీ మేకప్ తో ఫుల్ షైనీగా కనిపించి క్లీన్ బౌల్డ్ చేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. రకరకాల పోజులను పోస్ట్ చేసిన తమన్నా.. తెల్ల పావురాల ఎమోజీలను క్యాప్షన్ గా ఇచ్చింది. ప్రస్తుతం తమన్నా కొత్త పిక్స్.. సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పిక్స్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సో షైనీ అని చెబుతున్నారు. పాలరాతి శిల్పంలా ఉన్నారని, నిజంగా మిల్కీ బ్యూటీనే అని కొనియాడుతున్నారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో ఓదెల 2 మూవీ చేస్తుండగా.. ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అటు బాలీవుడ్? లో డార్లింగ్ పార్ట్ నర్స్ తో త్వరలోనే సందడి చేయనుంది.



# ఓటీటీలోకి వస్తున్న శర్వానంద్ మూవీ

టాలీవుడ్‌లో తన చిన్న పాత్రలతో ప్రారంభించిన శర్వానంద్ ఇప్పుడు క్రేజీ హీరోగా ఎదిగాడు. స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుని, తన కష్టంతో మంచి గుర్తింపును సాధించిన ఈ యంగ్ హీరో, ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత ప్రతిభావంతులైన నటుల్లో ఒకరిగా ప్రసిద్ధి చెందాడు. గతంలో కొన్ని సినిమాలు ఆశించిన విధంగా మంచి ఫలితాలు ఇవ్వకపోయినా, శర్వా ఎప్పుడూ హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా కృషి కొనసాగించాడు. తన కెరీర్లో ఒకే ఒక్క జీవితం వంటి సినిమాలతో పలు డిజాస్టర్స్ ఎదురైనప్పటికీ, శర్వానంద్ మాత్రం ఎప్పటికప్పుడు కొత్త ప్రయత్నాలు చేస్తూ, ప్రేక్షకులకు అలవాటైన హీరోగా నిలిచాడు. ఒకే ఒక్క జీవితం సినిమా అప్పట్లో మంచి అంచనాలతో విడుదలై, నిరాశపరిచింది. ఈ సినిమా వరుస డిజాస్టర్స్ తో ఎప్పుడు అదే స్థాయిలో విజయం సాధించడం లేదు.

**ఓటీటీలోకి వస్తున్న శర్వానంద్ మూవీ**

శర్వానంద్ సినిమాలు ఎప్పటికప్పుడు మంచి క్రేజ్‌ను సృష్టిస్తాయి కానీ "శతమానం భవతి" తరువాత అతడికి అంతటి పెద్ద విజయం రాలేదు.కానీ ఇప్పుడు "మనమే" అనే సినిమాతో ఈ యువ హీరో మరో ప్రయత్నం చేశాడు. అయితే ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దాదాపు ఏడాది క్రితం విడుదలైన ఈ సినిమా థియేటర్లలో నిరాశపరిచినప్పటికీ, ఓటీటీలో ఇంకా విడుదల కాలేదు. దీనితో పాటు ఈ సినిమాను మర్చిపోయిన ప్రేక్షకులు ఈ సినిమా ఓటీటీ విడుదలపై మరింత నిరాశ వ్యక్తం చేసారు ఇక ఇప్పుడు చాలా సమయం తర్వాత "మనమే" సినిమా ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఎలాంటి హిట్ ఇవ్వకపోయినా అమెజాన్ ప్రైమ్ %ఎఱఅవశీ% ఈ సినిమాకు ఓటీటీ రైట్స్ సొంతం చేసుకుంది.మార్చి 7 నుండి ఈ సినిమా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించారు. ఈ సినిమా దాదాపు ఒక సంవత్సరం ఆగి, ఇప్పుడు ఓటీటీలో విడుదల అవుతోంది, దాంతో ప్రేక్షకుల్లో ఒక రకమైన సంచలనం రేగింది."మనమే" సినిమా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్. శర్వానంద్ ఇందులో హీరోగా నటించగా హీరోయిన్‌గా కృతిశెట్టి నటించింది. ఈ సినిమాలో శర్వానంద్ తన కామెడీ టైమింగ్‌తో మెప్పించాడు. అతడికి కృతిశెట్టి కి మధ్య కెమిస్ట్రీ కూడా బాగా కుదిరింది. కానీ కథ అనేది రొటీన్‌గా ఉండడంతో, ప్రేక్షకులను ఆకట్టుకోవడం కష్టమైంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. అయితే ఓటీటీ విడుదల కోసం కొన్ని వివాదాలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ వివాదాలు సత్వరంలో పరిష్కరించబడిన తరువాత, ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా ఓటీటీలో విడుదలయ్యే రోజు, 2023 మార్చి 7న, "మనమే" అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుందని వెల్లడించారు. ఈ సినిమా సినిమా ఇండస్ట్రీలో పెద్దగా దృష్టిని ఆకర్షించలేకపోయినా శర్వానంద్ అభిమానులు మాత్రం ఈ సినిమాను ఓటీటీలో చూడటానికి ఎదురు చూస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339